మిగిలింది..

● బూడిదగుమ్మడికి ధరాఘాతం ● కొనేవారు లేక పొలాల్లోనే వదిలేసిన రైతులు ● వంద ఎకరాల్లో పెట్టుబడి నష్టం రూ.కోటి పైనే..

బూడిదే..!





మండ్లిపల్లి వద్ద పొలంలోనే వదిలేసిన బూడిదగుమ్మడికాయలు

తనకల్లు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ధరలు లేకపోవడంతో మండలంలో బూడిదగుమ్మడి పంట సాగు చేసిన రైతులు నష్టలు చవిచూస్తున్నారు. సాధారణంగా సాగు చేసే కూరగాయలు, ఆకు కూరలు వంటివి కాకుండా మండల రైతులు ఈ ఏడాది కొత్తగా బూడిదగుమ్మడి పంటను సాగు చేశారు. మండలంలోని మండ్లిపల్లి, సీజీప్రాజెక్టు, పెద్దపల్లి, బొంతలపల్లి, నందిగానిపల్లి, ఈతోడు, తదితర గ్రామాల్లో దాదాపు వంద ఎకరాలకు పైగా బూడిద గుమ్మడి పంటను సాగు చేశారు.

దిగుబడి భారీగా వచ్చినా..

నూతన పంట కావడంతో రైతులు ఎంతో ఉత్సహంగా ఎరువులు, పురుగు మందులు వాడి మంచి దిగుబడులు సాధించారు. ఒక్కో కాయ 15 కిలోల నుంచి 30 కిలోల దాకా దిగుబడి వచ్చింది. పంట కోతకొచ్చేదశలో కర్ణాటక, చెన్నై మార్కెలో బూడిదగుమ్మడి ధరలు పతనమయ్యాయి. బూడిదగుమ్మడిని అడిగేనాథుడే లేక పొలాల్లోనే వదిలేశారు. దీంతో రైతులకు ఎకరాకు రూ.లక్ష చొప్పున రూ.కోటికిపైగా పెట్టుబడి నష్టపోయినట్లు రైతులు వాపోతున్నారు. ఈఏడాది ఏమైందో ఏమో రైతులు సాగుచేసిన వాణిజ్య పంటలన్నీ నష్టాలే మిగిల్చినట్లు రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం కరువు మండలంగా ప్రకటించి చేతులు దులుపుకుందే తప్ప తమను ఆదుకున్నపాపాన పోలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులెవరూ రైతులను ఆదుకోవడానికి ప్రయత్నించకపోవడం విమర్శలకు తావిస్తోంది. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వాణిజ్య పంటలు సాగు చేసి నష్టపోయిన మండల రైతులను ఆదుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కర్ణాటక నుంచి విత్తనాలు తెచ్చి..



ఈఏడాది వివిధరకాల వాణిజ్య పంటల్లో నష్టాలు వచ్చాయి. బూడిదగుమ్మడి సాగుచేస్తే, నష్టాల నుంచి గటెక్కవచ్చని కర్ణాటకలోని చింతామణికి వెళ్లి బూడిదగుమ్మడి విత్తనాలు తెచ్చి, ఐదు ఎకరాల్లో పంట సాగు చేశా. దుక్కి దున్నడం, ఎరువులు, మల్చింగ్ షీట్, డ్రిప్‌లు, కూలీలు, విత్తనాలు రసాయన ఎరువులు, పురుగుమందులు తదితర వాటి కోసం ఎకరాకు రూ. లక్ష ఖర్చు చేశా. పంట చేతికొస్తే అడిగే నాథుడే లేడు. దీంతో ఐదు ఎకరాల్లో పంట అలాగే వదిలేశా. నష్టపోయిన రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి.

\- పూల వెంకటనారాయణ, రైతు, సీజీ ప్రాజెక్టు

బాధగా ఉంది: రెడ్డి శేఖర్‌రెడ్డి, రైతు, మండ్లిపల్లి

వేరే మండలంలో నాకు తెలిసిన ఓ రైతు బూడిద గుమ్మడి సాగు చేస్తుండటంతో అతడిని సంప్రదించా. పంట గురించి ఆరా తీశా. బాగుంటుందని చెప్పడంతో విత్తనాలు తెప్పించి ఐదు ఎకరాల్లో సాగు చేశా. ఎరువులు, విత్తనాలు, కూలీలు, మందుల కోసం ఎకరాకు రూ.లక్షకుపైగా ఖర్చు చేశా. దిగుబడి ఆశజనకంగా ఉంది. ఇప్పటికి 50టన్నులు పొలంలో పెట్టుకోలేక బయట వ్యాపారులకు అడిగినకాడికి విక్రయించా. ఇంకా వంద టన్నులపైకుపైగా సరుకుంది. అడిగేవారే లేరు. పొలంలోనే దిగుబడిని వదిలివేయడం చెప్పలేనంత బాధగా ఉంది.



కోటలోని మొనగాడు

తెలంగాణ సీఎస్‌గా

కొడిగెనహళ్లి పూర్వ విద్యార్థి



6

ఉచిత విద్యకు దరఖాస్తు చేసుకోండి

కొత్తచెరువు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత విద్య కోసం అర్హులైనవారు దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ క్రిష్టప్ప, సమగ్రశిక్ష ప్రాజెక్టు కోఆర్డినేటర్ దేవరాజు సోమవారం ఓ సంయుక్త ప్రకటనలో కోరారు. ప్రైవేట్ పాఠశాలల్లో 2025-26విద్యా సంవత్సరానికి ఒకటో తరగతిలో ప్రవేశానికి మే రెండు నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.సీఎస్‌ఈ.ఏపీ.జీఓవీ.లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అరటికి మహాదెబ్బ

● మహారాష్ట్ర నుంచి అధికంగా దిగుమతి ● రెండో కోతకు రాని వ్యాపారులు ● గొర్రెలకు ఉచితంగా ఇచ్చేస్తున్న రైతులు



అరటి గెల



గొర్రెలకు వేసేందుకు తీసుకెళ్తున్న అరటికాయలు

తాడిమర్రి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో తగ్గాల్సిన అరటి ధరలు మండు వేసవిలో నేల చూపులు చూస్తున్నాయి. అరటిలో మొదటి కోత కాయలు కొనడానికి వ్యాపారులు ముందుకు వస్తున్నారే కానీ రెండో కోతకు ఎవరూ ముందుకు రావడం లేదు. మండలంలో దాదాపు 800 ఎకరాలకు పైబడి అరటి పంట సాగు చేశారు. ఎకరాకు దాదాపు రూ.1.5 లక్షలు పెట్టుబడి పెట్టారు. ప్రస్తుతం మండల వ్యాప్తంగా 200 ఎకరాల దాకా కోతకు వచ్చిన పంట ఉంది. అయితే మహారాష్ట్ర నుంచి అధికంగా దిగుమతి అవుతుండటంతో స్థానిక అరటి కాయలను అడిగే వారు లేరని రైతులు వాపోతున్నారు. ఒకవేళ అడిగినా రూ.2500నుంచి రూ.6వేల ధరకే అడుగుతున్నారు. ఈధరలతో కాయలు అమ్ముకుంటే పెట్టుబడుల్లో పావు శాతం కూడా రాదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విధిలేని పరిస్థితుల్లో పంటను గొర్రెలకు ఉచితంగానే ఇస్తున్నారు. కాపరులు కాయలు కోసుకుని ట్రాక్టర్ల ద్వారా తరలించి గొర్రెలకు వేస్తున్నారు. దీంతో ఈ వేసవిలో పశుగ్రాసం సమస్య కొంతవరకు తగ్గిందని వారు చెబుతున్నారు.



పెట్టుబడులు కూడా రాలేదు

నేను నాలుగు ఎకరాల్లో పంట సాగు చేశా. రూ. ఆరులక్షల దాకా పెట్టుబడి పెట్టా. ఇప్పుడు రూ.లక్ష కూడా వచ్చేలా లేదు. నాణ్యమైన అరటికాయలు ఉన్నప్పటికీ అడిగేవారేలేక వదిలేసుకోవాల్సి వస్తోంది. తెలుగు రాష్ట్రాలకు అవసరమయ్యే అరటిపంట మన రాష్ట్రాలలోనే లభ్యమవుతున్నా మహారాష్ట్ర నుంచి అరటి దిగుమతి చేసుకోవడం వల్లే ఈ పరిస్థితి దాపురించింది.

\- నాగమనాయుడు, రైతు, తురకవారిపల్లి

ప్రతి అర్జీనీ పరిష్కరించాలి: కలెక్టర్



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

పుట్టపర్తిటౌన్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల వేదిక (పీజీఆర్ఎస్)లో ప్రజలు ఇచ్చిన ప్రతి అర్జీకీ పరిష్కారం చూపాలని కలెక్టర్ టీఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం పీజీఆర్ఎస్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి 231 అర్జీలను స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలు ఇచ్చిన ప్రతి అర్జీని ఆయాశాఖాధికారులు, హెచ్‌ఓడీలు క్షేత్రస్థాయిలో పరిశీలించి, నాణ్యమైన పరిష్కారం చూపించాలని ఆదేశించారు. పీజీఆర్ఎస్‌కు వచ్చే ఫిర్యాదులు పరిష్కరించడానికి డీఆర్వో, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, డీఆర్వో విజయసారథి, ఆర్డీఓ సువర్ణ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణరెడ్డి, పరిశ్రమల శాఖ జీఎం నాగరాజు, పశుసంవర్థక శాఖ జేడీ శుభదాస్, తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

● జిల్లాలో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కాయకూరలు, తృణధాన్యాల స్టాళ్లను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాల్లో, ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటల సాగును ప్రోత్సహించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

చట్టపరిధిలో పరిష్కారం: ఎస్పీ

పుట్టపర్తిరూరల్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ప్రజల సమస్యలకు చట్టపరిధిలో పరిష్కారం చూపాలని జిల్లా ఎస్పీ రత్న పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాల యంలో ఎస్పీ ఆధ్వర్యంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ 65 ఫిర్యాదులను స్వీకరించారు. జిల్లా నలు మూలల నుంచి విచ్చేసిన ఫిర్యాదుదారులతో ఎస్పీ మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఫిర్యాదుదారుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని సంబంధిత పోలీసు అధికారులను ఎస్పీ ఆదేశించారు. కుటుంబ కలహాలు, భూసమస్యలు, ఆర్థికమోసాలు, ఆస్తి పంపకాలకు సంబంధించిన వివాదాలు, సైబర్‌నేరాలు వంటివాటిపై ఎక్కువగా ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు.

వైసీపీ మహిళకు అధ్యక్ష పీఠం

● గుట్టుగా ఐకేపీ మండల అధ్యక్షురాలిగా నియామకం ● ఆగ్రహం వ్యక్తం చేస్తున్న తెలుగుతమ్ముళ్లు



ఐకేపీ కార్యాలయంలో సమావేశం నిర్వహిస్తున్న నర్మదారెడ్డి(ఫైల్)

కొత్తచెరువు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ఐకేపీ మండల అధ్యక్షురాలిగా వైసీపీకి చెందిన నర్మదారెడ్డిని నియమించడం పట్ల మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి సిఫార్సు లేఖను సైతం కాదని నాలుగు నెలల కిందటే గుట్టు చప్పుడు కాకుండా నర్మదారెడ్డికి పదవి కట్టబెట్టడంలో ఆంతర్యమేంటని ఐకేపీ అధికారులను నిలదీసినట్లు సమాచారం. కొత్తచెరువు మండలానికి చెందిన మహిళను కాకుండా పుట్టపర్తి మండలానికి చెందిన నర్మదారెడ్డిని నియమించడం ఏమిటో తమకు అర్థం కావడంలేదని పలువురు టీడీపీ నాయకులు వాపోతున్నారు. 15 సంవత్సరాల నుంచి పుట్టపర్తి మండలంలోనే నివాసం ఉంటున్న ఆమెను మండల సమాఖ్య అధ్యక్షురాలిగా నియమించి, ఆమెతో సభలు, సమావేశాలు నిర్వహింపజేస్తూ అధికారులు నిధులు కాజేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పార్టీకి కష్టపడిన వారికి కాకుండా ప్రతిపక్ష పార్టీకి చెందిన వారికి పదవులు ఇవ్వడంపై కొందరు తెలుగుతమ్ముళ్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే చొరవ చూపి పార్టీకి కష్టపడిన వారికి ప్రాధాన్యం ఇవ్వాలని కోరుతున్నారు. అలాకాకపోతే వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ నష్టం జరగక తప్పదని హెచ్చరిస్తున్నారు.

ఆగ్రహించిన అన్నదాత

● విద్యుత్ అధికారుల తీరుపై మండిపాటు

● డబ్బు తీసుకుని.. ట్రాన్స్‌ఫార్మర్లు ఇవ్వలేదని ఆరోపణలు

● సబ్‌స్టేషన్ ముందు ట్రాక్టర్లతో ఆందోళన

మడకశిర టౌన్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): డీడీలు చెల్లించినా.. రూ.వేలల్లో డబ్బు గుంజిన అధికారులు ట్రాన్స్‌ఫార్మర్లు ఇవ్వకుండా మోసం చేశారంటూ అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. అమరాపురం, గుడిబండ మండలాల పరిధిలోని పలు గ్రామాల రైతులు సోమవారం పట్టణ సమీపంలోని వజ్రపాళ్యం గ్రామం వద్దగల విద్యుత్ సబ్‌స్టేషన్ ముందు రోడ్డు పై ఆందోళన చేపట్టారు. అమరాపురం మండల ఏఈ.. ట్రాన్స్‌ఫార్మర్ల కోసం తమ నుంచి అదనంగా డబ్బు వసులు చేశారని ఆరోపించారు. ట్రాన్స్‌ఫార్మర్లు ఇస్తామని చెప్పిన అధికారి పత్తాలేకుండా పోయారని వారు మండిపడ్డారు. రోడ్డుపై ట్రాక్టర్లను అడ్డంగా పెట్టి ఆందోళన చేశారు. గంటపాటు ఆందోళన చేయడంతో ట్రాఫిక్ పెద్దఎత్తున స్తంభించిపోయింది. సబ్ స్టేషన్‌లో ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నా.. తమకు ఇవ్వకపోవడం పట్ల రైతులు మండిపడ్డారు. పోలీసులు నచ్చజెప్పడంతో రైతులు ఆందోళన విరమించారు. అక్కడి నుంచి రైతులు.. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి వద్దకెళ్లి, అధికారులపై ఫిర్యాదు చేశారు. తమ వద్ద పెద్ద మొత్తంలో డబ్బు వసూలు చేసి అధికారి మోసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు.



రోడ్డుపై ఆందోళన చేస్తున్న రైతులు



వైసీపీ పాపం..

హంద్రీనీవా కాలువపై ఐదేళ్లూ నిర్లక్ష్యం.. మరమ్మతులు కూడా చేయని దుస్థితి

పేరుకుపోయిన పూడిక.. బలహీనంగా మారిన గట్లు.. పదేపదే గండ్లు

సోమందేపల్లి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలకుల నిర్లక్ష్యం హంద్రీనీవా కాలువకు శాపంగా మారింది. గడిచిన ఐదేళ్లలో కాలువ మరమ్మతులు చేపట్టకపోవడంతో కాలువగట్లు బలహీనంగా మారి తరచూ గండ్లు పడుతున్నాయి. కరువు జిల్లా జీవనాడి అయిన హంద్రీనీవాను పట్టించుకోకపోవడంవల్ల ఈ దుస్థితి దాపురించిందని విమర్శలున్నాయి. రైతుల పక్షపాతిగా చెప్పుకుంటున్న వైసీపీ నాయకులు ఐదేళ్లలో హంద్రీనీవాలో తట్టెడు మట్టి కూడా ఎత్తిపోయలేదని ఇటీవల మంత్రి సవిత కూడా విమర్శించారు. దీంతో 265 చెరువులను నింపి 45 వేల ఎకరాలకు తాగునీరు ఇవ్వాలన్న ప్రభుత్వం లక్ష్యం నీరుగారుతోంది. భవిష్యత్తులో కాలువలు పటిష్ఠం చేస్తే తప్ప.. పూర్తిస్థాయిలో చెరువులు నింపడం అసాధ్యమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తరచూ గండ్లు

హంద్రీనీవా కాలువ గట్లను నాసిరకంగా నిర్మించారని విమర్శలున్నాయి. కాలువలు తవ్విన మట్టితోనే గట్లను నిర్మించడంతో తరచూ గండ్లు పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి మడకశిర బ్రాంచ్ కెనాల్ ద్వారా 171 కి.మీ. పొడవుతో పెనుకొండ, హిందూపురం, మడకశిర నియోజకవర్గాల్లో హంద్రీనీవా కాలువ ఉంది. 265 చెరువులు నింపడం లక్ష్యం కాగా.. గట్ల నాణ్యత ప్రశ్నార్థకంగా మారడంతో గండ్లు పడుతున్నట్లు అధికారులు అభిప్రాయపడుతున్నారు. గతంలో పెనుకొండ మండలం కోనాపురం, హరిపురం వద్ద పలుమార్లు గండ్లుపడ్డాయి. సోమందేపల్లి మండలంలో గతేడాది పందిపర్తి, మంచేపల్లి గ్రామాల సమీపంలో గండ్లు పడ్డాయి. ఈ ఏడాది ఏప్రిల్‌లో కేవలం 17రోజుల వ్యవధిలో సోమందేపల్లి సమీపంలో రెండుసార్లు కాలువగట్లు తెగడం గమనార్హం.

రూ.1.2 కోట్లతో మరమ్మతులు

కొత్త ప్రభుత్వం కొలువుదీరిన ఆరు నెలల్లోనే హంద్రీనీవా కాలువగట్ల మరమ్మతులపై దృష్టి సారించింది. మంత్రి సవిత, హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ చొరవతో గతేడాది రూ.1.20కోట్ల నిధులు మంజూరు చేసింది. ఎనిమిది చోట్ల పడిన కాలువ గండ్లను పూడ్చి మరమ్మతులు చేపట్టారు. అనంతరం ఫిబ్రవరిలో గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి మంత్రి సవిత చెరువులను నింపే లక్ష్యంతో నీటిని విడుదల చేశారు. పెనుకొండ నియోజకవర్గంలో 14 చెరువులను వందశాతం, ఐదింటిని 70శాతం నింపారు. హిందూపురం నియోజకవర్గంలో రెండు చెరువులను వందశాతం, మరో ఐదింటిన 50 శాతం కృష్ణాజలాలతో నింపారు. ఇటీవల సోమందేపల్లిలో రెండు కిలోమీటర్ల వ్యత్యాసంలో రెండు సార్లు గండిపడటంతో కాలువ పటిష్ఠతపట్ల ప్రశ్నలు తలెత్తుతున్నాయి. నీటి విడుదలతో కాలువలో ప్రవాహ ధాటికి అడుగుభాగంలో మట్టి కొట్టుకుపోయి గండ్లు పడుతున్నట్లు హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులు పేర్కొంటున్నారు.



ఇటీవల నక్కలగుట్ట కాలనీ సమీపాన కాలువకు పడిన గండి

కాలువల సామర్థ్యం పెంపునకు కృషి

గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా జిల్లాలో హంద్రీనీవా కాలువ మరమ్మతులకు నోచుకోలేదు. వాటిలో కంపచెట్లు, పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి, పూడికతో అధ్వాన్నంగా మారాయి. దీనికితోడు గట్లు బలహీనమవడంతో నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. కాలువల ద్వారా పూర్తిస్థాయిలో నీటి సరఫరా చేయలేకపోతున్నారు. కాలువలు కోతకు గురవుతుండటంతో ప్రభుత్వం మరమ్మతులపై దృష్టిసారించింది. కాలువ వెడల్పుచేసి, సామర్థ్యం పెంచేందుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. పలుచోట్ల ఇప్పటికే కాలువ మరమ్మతులు జరుగుతున్నాయి. గొల్లపల్లి రిజర్వాయర్ కింద మడకశిర బ్రాంచ్ కెనాల్ మరమ్మతులకు శ్రీకారం చుట్టారు. దశలవారీగా కాలువ వెడల్పు పనులను చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

ప్రతిపాదనలు పంపాం

హంద్రీనీవా కాలువ గట్లు బలహీనంగా ఉండటంతో తరచూ గండ్లు పడుతున్నాయి. అవి ప్రవాహాన్ని తట్టుకోలేక మట్టికోతకు గురై కట్టలు తెగిపోతున్నాయి. గండిపడిన చోట్ల మరమ్మతులు చేసి వాటిని పూడ్చుతున్నాం. మరికొన్ని రోజుల్లో నీటి సరఫరా ఆగిపోనుంది. రూ.650కోట్లతో కాలువ వెడల్పు పనుల కోసం ప్రతిపాదనలు పంపాం. గొల్లపల్లి నుంచి 71కి.మీ. వరకు మొదటి దశ మరమ్మతులు చేపడతాం. నిధులు మంజూరైన వెంటనే కాలువ వెడల్పు పనులు ప్రారంభిస్తాం.

\-శ్రీనివాసులు, ఈఈ, హెచ్ఎన్ఎస్ఎస్

వేతన పోరు..!

- తాగునీటి కార్మికుల వేతన వెతలు
- 24 రోజులుగా కొనసాగుతున్న సమ్మె
- పట్టించుకోని అధికారులు


ఎస్‌ఈ కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న కార్మికులు (ఫైల్)

అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): వేతనం అందాలంటే సమ్మె చేయాల్సిందే అన్న చందంగా శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికుల పరిస్థితి తయారైంది. ఐదు నెలలుగా వేతనాలు అందట్లేదు. అధికారుల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ లెక్కలేని తనంతో కార్మికులకు తిప్పలు తప్పడం లేదు. ఉమ్మడి జిల్లాలోని ఉరవకొండ, కళ్యాణదుర్గం, రాయదుర్గం, మడకశిర, హిందూపురం, పెనుకొండ మండలాల్లోని 727 గ్రామాలకు పీఏబీఆర్ నుంచి శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం ద్వారా నీరు సరఫరా చేస్తున్నారు. ఈ పథకంలో 588 మంది కార్మికులు పని చేస్తున్నారు. వీరికి 5 నెలల వేతనాలు పెండింగ్ ఉండటంతోపాటు ఈపీఎఫ్ జమ చేయకుండా కాలయాపన చేస్తున్నారు. దీంతో పలుమార్లు కార్మికులు సమ్మెబాట పట్టినా అధికారులు కంటి తుడుపు చర్యలతో సరిపెడుతున్నారు. ఒకట్రెండు నెలల వేతనం జమ చేసి, సమ్మె విరమించేలా చేస్తూ వస్తున్నారు. కార్మికులు ప్రస్తుతం తమ సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె విరమించే ప్రసక్తే లేదని తేల్చి చెబుతున్నారు. ప్రస్తుతం వేసవి కావడంతో నీరు సరఫరాకాక అధికారులకు తలనొప్పిగా మారింది. ప్రస్తుతానికి స్థానికంగా ఉన్న వనరుల నుంచి నీరు సరఫరా చేస్తున్నారు. ఇకపై ఇబ్బందులు తప్పవని ఆందోళన చెందుతున్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం

శ్రీరామిరెడ్డి నీటి పథకం కార్మికులకు సంబంధించి టెండరు గడువు ముగియడంతో వేతనాల చెల్లింపులో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. పాత కాంట్రాక్టర్ ద్వారా చెల్లిద్దామన్నా.. నిధుల కొరత ఉంది. టెండరు పూర్తి చేసి బకాయి వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకుంటాం.

-సురేష్, ఎస్ఈ, ఆర్‌డబ్ల్యూఎస్

కోటలోని మొనగాడు..!

తెలంగాణ సీఎస్‌గా గుత్తివాసి రామకృష్ణారావు

- తాత చంద్రమౌళీశ్వర రావు స్వాతంత్ర్య సమరయోధుడు
- తండ్రి రైల్వే ఉద్యోగి.. హైదరాబాద్‌లో స్థిరపడిన కుటుంబం


తెలంగాణ సీఎం అభినందనలు


రామకృష్ణారావు కుటుంబం నివసించిన ఇల్లు ఇక్కడే ఉండేది.. కొన్నవారు ఇలా పునర్నిర్మించారు

గుత్తి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): గుత్తి కోట వీధిలో ఒకప్పుడు ఓనమాలు దిద్దిన కె. రామకృష్ణారావు తెలంగాణ ప్రభుత్వ చీఫ్ సెక్రటరీగా నియమితులయ్యారు. వీరిది స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబం. గుత్తి పట్టణంలోని కోట ప్రాంతంలో వీరి కుటుంబం ఉండేది. రామకృష్ణారావు తాత(తండ్రికి తండ్రి) కూట్లిగి చంద్రమౌళీశ్వర రావు స్వాతంత్ర్యోద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. తల్లిదండ్రులు గురునాథరావు, భాగ్యలక్ష్మి దంపతులు. గురునాథరావు రైల్వే ఉద్యోగి కావడంతో బదిలీలపై వేర్వేరు ప్రాంతాలకు వెళ్లారు. చివరకు హైదరాబాదులో స్థిరపడ్డారు.

గుత్తి నుంచే ప్రస్థానం..

రామకృష్ణారావు గుత్తి కోట వీధిలోని పట్టు కేశవపిళ్లై ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఒకటి నుంచి 5వ తరగతి వరకు చదివారు. శ్రీసత్యసాయి జిల్లా (ఉమ్మడి అనంతపురం జిల్లా) పరిగి మండలంలోని కొడిగెనహళ్లి ఏపీ ఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదివారు. నాగార్జున సాగర్‌లో ఇంటర్, కాన్పూర్ ఐఐటీలో బీటెక్, ఢిల్లీ ఐఐటీలో ఎంటెక్, డ్యూక్ యూనివర్శిటీలో ఎంబీఏ పూర్తి చేశారు. 1991లో ఐఏఎస్ సాధించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని నల్గొండ, మహబూబ్‌నగర్, నిజామబాద్ జిల్లాల సబ్ కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌గా, గుంటూరు, ఆదిలాబాద్ జిల్లాల కలెక్టర్‌గా, విద్యాశాఖ కమిషనర్‌గా, ప్రణాళిక శాఖ ముఖ్య కార్యదర్శిగా పనిచేశారు. తెలంగాణ ఏర్పడిన తరువాత ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శిగా విధులు నిర్వహించారు.


గుత్తిలో స్నేహితులతో రామకృష్ణారావు దంపతులు (ఫైల్)

జ్ఞాపకాలే మిగిలాయి..

గుత్తి కోట వీధిలో రామకృష్ణారావు కుటుంబానికి సొంత ఇల్లు ఉండేది. ఇదే మండలంలోని కొత్తపేట గ్రామ పరిధిలో భూములు ఉండేవి. ఇంటిని అమ్మేశారు. భూములను కూడా విక్రయించారని తెలిసింది. ప్రస్తుతం ఇక్కడ వారికి బంధువులు ఎవరూ లేరు. ప్రాథమిక పాఠశాలలో కలిసి చదువుకున్న చిన్ననాటి స్నేహితులు నాగరాజు, సిఖందర్ తదితరులు ఉన్నారు. 2014లో కుటుంబ సమేతంగా రామకృష్ణారావు గుత్తికి వచ్చారు. తాను చదువుకున్న పాఠశాలకు వెళ్లి ఆనందంగా గడిపారు. స్నేహితులను కలిశారు. ఆ తరువాత గుత్తికి మరోమారు రాలేదని ఆయన స్నేహితులు తెలిపారు.


గుత్తి కోటవీధిలో రామకృష్ణారావు చదువుకున్న పాఠశాల

గర్వంగా ఉంది..



నా చిన్ననాటి స్నేహితుడు తెలంగాణ సీఎస్ కావడం గర్వంగా ఉంది. మేము ఐదో తరగతి వరకూ కలిసి చదువుకున్నాం. చిన్నప్పుడే విడిపోయినా స్నేహాన్ని కొనసాగిస్తున్నాం.

-నాగరాజు, పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం జిల్లా సహకార శాఖ అధికారి

ఆనందంగా ఉంది..



నా చిన్ననాటి స్నేహితుడు తెలంగాణ రాష్ట్రానికి సీఎస్ కావడం ఆనందంగా ఉంది. ఆయన కుటుంబసమేతంగా గుత్తికి వచ్చినప్పుడు మా ఇంటికి వచ్చారు. మేము చదువుకున్న పాఠశాలకు వెళ్లి ఆనందంగా గడిపాము. చిన్ననాటి జ్ఞాపకాలను నేమరువేసుకున్నాము. - సిఖందర్, స్నేహితుడు

ఐటీఐ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ఐటీఐ కళాశాలల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కన్వీనర్ రామమూర్తి సోమవారం ప్రకటనలో తెలిపారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, సివిల్, డీజిల్ మెకానిక్, టర్నర్, మెషినిస్ట్, మోటార్ మెకానిక్, కోపా తదితర కోర్సులకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పదో తరగది ఉత్తీర్ణులైన విద్యార్థులు మే 24వ తేదీలోపు https://iti.ap.gov.in/ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

బీటెక్ ఫలితాలు విడుదల

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన బీటెక్ పరీక్షల ఫలితాలను సోమవారం ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చెన్నారెడ్డి విడుదల చేశారు. ఏప్రిల్‌లో నాలుగో సంవత్సరం ద్వితీయ సెమిస్టర్ (ఆర్20) రెగ్యులర్ పరీక్షలు నిర్వహించామన్నారు. వాటి ఫలితాల కోసం కళాశాలలోని అకడమిక్ సెక్షన్‌లో సంప్రదించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వసుంధర, డీసీఈలు ప్రొఫెసర్ మాధవి, డాక్టర్ లలితకుమారి, విభాగాధిపతులు కళ్యాణిరాధ, మమత, అజిత, జరీనా, నారాయణరెడ్డి, రామశేఖర్ రెడ్డి, కల్యాణ్‌కుమార్ పాల్గొన్నారు.

రేపే పాలిసెట్

37 కేంద్రాలు..

14,205 మంది విద్యార్థులు..

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశానికి రాష్ట్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో బుధవారం పాలిసెట్-2025 నిర్వహించనున్నారు. ఇందుకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 37 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. 14,205 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు పాలిసెట్ నిర్వాహక కన్వీనర్లు జయచంద్రారెడ్డి, సురేష్‌బాబు తెలిపారు. అనంతపురంలో 9, తాడిపత్రిలో 6, గుంతకల్లులో 4, కళ్యాణదుర్గంలో 3, కదిరి, ధర్మవరం, హిందూపురంలో 5 చొప్పున మొత్తం ఉమ్మడి జిల్లాలో 37 కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు.

ఇందుకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఉదయం 11 గంటలకు పరీక్షలు ప్రారంభమౌతాయనీ, గంట ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు. హాల్‌టిక్కెట్ రానివారు సమీపంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

బీఈడీ పరీక్షల్లో నలుగురు డిబార్

పలు తేదీల్లో పరీక్షలు వాయిదా

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ఎస్కేయూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బీఈడీ పరీక్షల్లో సోమవారం నలుగురు విద్యార్థులను డిబార్ చేసినట్లు పరీక్షల నిర్వహణ విభాగాధిపతి ప్రొఫెసర్ జీవీ రమణ తెలిపారు. పరీక్షా కేంద్రాలను తనఖీ చేసి, మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతున్న వారిని డిబార్ చేశామన్నారు. ఈనెల 29, 30 తేదీల్లో, మే 7న నిర్వహించాల్సిన పరీక్షలను వాయిదా వేశామన్నారు.

పాలిసెట్, ఐసెట్ కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. వీటిని జూన్ 2, 3, 4 తేదీల్లో తిరిగి నిర్వహిస్తామనీ, విద్యార్థులు ఈ మార్పును గమనించాలని ఆయన కోరారు.

ఆశాజనకంగా మార్కెట్ ఫీజు వసూళ్లు

మార్కెటింగ్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సత్యనారాయణ చౌదరి



అనంతపురంరూరల్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మార్కెట్ యార్డుల్లో ఫీజు వసూళ్లు ఆశాజనకంగా ఉందని జిల్లా మార్కెటింగ్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సత్యనారాయణ చౌదరి పేర్కొన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 96.75 శాతం మార్కెట్ ఫీజు వసూళ్ల రాబట్టినట్లు తెలిపారు. లక్ష్యాలు, వసూళ్ల గురించి ఆయన 'ఆంధ్రజ్యోతి'కి వివరాలు వెల్లడించారు.

ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి: గత ఆర్థిక సంవత్సరం మార్కెట్ ఫీజు లక్ష్యమెంత..? ఎంత వసూలైంది..?

ఏడీ: 2024-25 ఆర్థిక సంవత్సరం రాష్ట్ర మార్కెటింగ్ శాఖ కమిషనర్ జిల్లాకు రూ.12.06 కోట్ల లక్ష్యాన్ని నిర్దేశించారు. రూ.11.66 కోట్లు వసూళ్ల రాబట్టి.. 96.75 శాతం నమోదు చేశాం. అంతకు ముందు ఏడాదితో పోల్చితే..రూ.35లక్షలు ఎక్కువగానే వసూళ్ల చేశాం.

ఆంధ్రజ్యోతి: వందశాతం పూర్తి చేసిన మార్కెట్ కమిటీలు ఉన్నాయా..?

ఏడీ: జిల్లాలోని తొమ్మిది మార్కెట్ యార్డుల్లో.. ఐదు కమిటీలు వంద శాతం లక్ష్యాలను పూర్తి చేశాయి. రాయదుర్గం మొదటి స్థానంలో ఉంది. రూ.1.44 కోట్లకు గాను.. రూ.1.61 కోట్లు వసూలు చేశారు. కళ్యాణదుర్గం రూ.61 లక్షలకు గాను రూ.64.16లక్షలు, శింగనమల రూ.1.02కోట్లకు.. రూ.1.05 కోట్లు, తాడిపత్రి రూ.2.02 కోట్లకు రూ.2.08 కోట్లు, గుంతకల్లు రూ.65 లక్షలకు రూ.66.04 లక్షలు వసూలయింది. అనంతపురం రూ.4.60 కోట్లకు.. రూ.4.34 కోట్లు వసూలు చేశాం.

ఆంధ్రజ్యోతి: వంద శాతం ఫీజు వసూలు కాకపోవడానికి కారణాలేమిటి..?

ఏడీ: గత ఆర్థిక సంవత్సరం అకాల వర్షాలతో పంట దిగుబడులు బాగా తగ్గిపోయాయి. ఎండు మిర్చి ధరలు పూర్తిగా పడిపోయాయి. దీంతో కొనుగోలు తగ్గిపోయాయి. కంది, వరి తదితర పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేసింది. వేరుశనగ దిగుబడలు తగ్గాయి. వీటి ప్రభావం ఫీజు వసూళ్లపై పడింది.

ఆంధ్రజ్యోతి: ఈ ఆర్థిక సంవత్సరం లక్ష్యాలను నిర్దేశించారా.. ఒక్కో కమిటీకి ఎంత..?

ఏడీ: ఇటీవల మార్కెటింగ్ శాఖ బడ్జెట్ సమావేశాలు నిర్వహించారు. ఇందులో జిల్లాకు రూ.13.49 కోట్లు లక్ష్యాన్ని నిర్దేశించారు. అనంతపురం మార్కెట్ కమిటీకి రూ.5.10 కోట్లు, గుత్తికి రూ.25 లక్షలు, గుంతకల్లు రూ.73 లక్షలు, కళ్యాణదుర్గం రూ.70 లక్షలు, రాప్తాడు రూ.50 లక్షలు, రాయదుర్గం రూ.1.76 కోట్లు, శింగనమల రూ.1.20 కోట్లు, తాడిపత్రి రూ.2.35 కోట్లు, ఉరవకొండకు రూ.90 లక్షలు మార్కెట్ ఫీజు వసూళ్ల లక్ష్యాలను ఇచ్చారు.

అటవీశాఖలో నోటీసుల కలకలం..!

చలానా సొమ్ము స్వాహాపై రికవరీకి ఆదేశాలు

- ఉద్యోగ విమరణ వేళ.. నోడ్యూస్ తిరకాసు
- తప్పుచేసిన వారితోనే నివేదిక తయారీ
- ప్రస్తుత సూపరింటెండెంట్‌కూ భాగస్వామ్యం
- ఇదెక్కడి న్యాయమంటూ సిబ్బంది గగ్గోలు

అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): అటవీశాఖలో పనిచేస్తున్న పలువురు అధికారులు, సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీచేయడంతో కలకలం రేగుతోంది. శని, ఆదివారాల్లో పలువురికి షోకాజ్ నోటీసులు పంపడంతో ఆ శాఖలో తీవ్ర చర్చనీయాంశమైంది. అనంతపురం రేంజ్‌కు సంబంధించి నకిలీ చలనాల రూపంలో దారి మళ్లిన సొమ్మును రికవరీ చేయడంలో అధికారులు వింతధోరణి అవలంబిస్తున్నారు. అక్రమార్కుడు అనంతపురం రేంజ్‌కే పరిమితం కాకుండా.. ఉమ్మడి జిల్లాలో ఎక్కడ పని చేస్తే అక్కడ నకిలీ చలానాల రూపంలో ప్రభుత్వ ఖజానాకు వెళ్లాల్సిన సొమ్మును దారి మళ్లించి జేబు నింపుకున్నాడని తెలుస్తోంది. ఎక్కడెక్కడ ఎంత నొక్కేశాడనేది బీట్‌ల వారిగా లెక్కలు తేల్చారు. సంబంధిత సిబ్బంది ద్వారా రికవరీ చేసేందుకు యంత్రాంగం చర్యలకు సిద్ధమయింది. అందుకు అనుగుణంగా షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఇదంతా చేస్తున్నది అందులో భాగస్వాములైన అప్పటి అకౌంటెంట్ కావడం పలు అనుమానాలకు దారి తీస్తోంది. అక్రమాలు జరిగిన సమయంలో కొన్ని రోజులు సూపరింటెండెంట్లుగా రవికుమార్, షాహనవాజ్ ఉన్నారు. పని ఒత్తిడి కారణంగా అప్పట్లో సీనియర్ అసిస్టెంట్‌గా ఉన్న రమేష్‌కు అకౌంట్స్ విభాగం బాధ్యతలు అప్పగించినట్లు వెలుగులోకి వచ్చింది. ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించినట్లు ఎలాంటి రికార్డులు చూపకపోవడంతో.. బాధ్యుడు రమేష్ అయినా రికార్డుల ప్రకారం ఉన్నవారిపై చర్యలకు శ్రీకారం చుట్టారు.



ఉద్యోగ విరమణ వేళ.. నోడ్యూస్ తిరకాసు

అక్రమాల్లో భాగస్వాములయిన ఉద్యోగ విరమణ పొందే వారికి నోడ్యూస్ ఇవ్వకుండా ఆదేశాలు జారీ చేశారు. అందుకు అనుగుణంగా షోకాజ్ నోటీసులు కూడా జారీ చేశారు. ఇందులో ప్రధానంగా ఐజాక్‌బాబు ముదిగుబ్బ ఎఫ్‌ఎస్‌ఓగా ఉన్నారు. ఈ నెలాఖరులో ఉద్యోగ విరమణ పొందనున్నారు. ఆయన ఎఫ్‌ఎస్‌ఓగా గుత్తిరేంజ్‌లో పని చేసిన సమయంలో బీట్ ఆఫీసర్ అయూబ్ బాషాకు సంబంధించిన చలానాలు సైతం నకిలీలుగా తేలాయి. ఇప్పటికే అయూబ్ బాషా మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకం ఇచ్చారు. ఎఫ్‌ఎస్‌ఓ ఐజాక్‌బాబు ఉద్యోగ విరమణ సమయంలో ఇబ్బంది పడాల్సిన పరిస్థితి నెలకొంది. అప్పట్లో ఆత్మకూరు సెక్షన్ ఆఫీసర్‌గా ఉండి.. ప్రస్తుతం కుప్పం డీఆర్వోగా ఉన్న పుల్లయ్య, ప్రస్తుతం అనంతపురం రేంజర్‌గా ఉన్న శ్రీనివాసులు జూన్ నెలలో ఉద్యోగ విరమణ పొందనున్నారు. వీరికి కూడా నోడ్యూస్ ఇవ్వడానికి అడ్డంకిగా మారింది. డీఆర్వోగా వెళ్లిన రామకోటి అప్పుడు జరిగిన అక్రమాల్లో తమ పాత్ర ఏమీ లేనప్పటికి బాధ్యత వహించాల్సిన పరిస్థితి నెలకొంది. ఆగస్టులో ఉద్యోగ విరమణ పొందనున్న అప్పటి రేంజర్‌గా ఉన్న సూర్యచంద్రరాజు ప్రస్తుతం డోన్ సబ్ డీఎఫ్‌ఓగా ఉన్నారు. ధర్మవరం డీఆర్వోగా ఉండి శ్రీశైలానికి రేంజర్‌గా బదిలీ అయిన రామకోటికి నోడ్యూస్ సమస్యలు తప్పేలా లేవు.

మొద్దు నిద్రలో అకౌంట్స్ విభాగం

ఇంత పెద్ద ఎత్తున అక్రమాలు చోటు చేసుకుంటుంటే.. అకౌంట్స్ విభాగం ఏమి చేస్తోందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇందులో ప్రస్తుత సూపరింటెండెంట్ గా ఉన్న అప్పటి సీనియర్ అసిస్టెంట్ ఇన్‌చార్జ్‌గా అకౌంట్స్ విభాగం బాధ్యతలు నిర్వహించారు. అకౌంట్స్ విభాగంలో మరో కాంట్రాక్ట్ వర్కర్ కీలకం కావడంతో తప్పిదాలు వెలుగులోకి వచ్చినప్పటికి తమకు ఏమీ తెలియనట్లు వ్యవహరించి ఉన్నతాధికారులకు నివేదిక పంపినట్లు సమాచారం. 2019 నుంచి 2023 వరకు ఈ తంతు జరుగుతున్నా ఏ ఒక్కటీ బయటకు రాకుండా జాగ్రత్త పడ్డారంటే ఈ కార్యాలయంలో కాంట్రాక్ట్ వర్కర్ల హవా ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుంది. జిల్లా అధికారి వద్దకు పంపే ముందు అకౌంట్స్ అధికారి, సూపరింటెండెంట్ పరిశీలిస్తారు. అసలు వీరు ఏమి చేశారన్నది ప్రశ్నార్థకరంగా మారింది. అనంతపురం రేంజ్‌లో ఏకంగా 173 నకిలీ చలానాలతో రూ.11,72,158, గుత్తిలో 34 నకిలీ చలానాలతో రూ.2,73,225 సొమ్ము పక్కదారి పట్టినట్లు సంబంధిత సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

రెగ్యులర్ సిబ్బందిపైనే ఒత్తిడి

ఉమ్మడి జిల్లాలో నకిలీ చలానాల రూపంలో కాంట్రాక్ట్ కార్మికుడి చేతిలో మోసపోయిన సిబ్బంది పరిస్థితి ఇటు నుయ్యి, అటు గొయ్యి అన్న చందంగా మారింది. అధికారుల తీరు చూస్తుంటే.. ప్రస్తుతం ఉన్న రెగ్యులర్ సిబ్బందిపైనే ఒత్తిడి తెచ్చి రికవరీకి చర్యలు చేపట్టేలా నోటీసులు జారీ చేశారు. అసలైన అక్రమార్కుడి నుంచి రికవరీకి ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం పలు అనుమానాలకు దారి తీస్తోంది. పోలీసుల నుంచి నిందితుడి స్టేట్‌మెంట్ రికార్డు చేసిన వివరాలు సైతం తెప్పించారు. అందులో కూడా అక్రమాలకు పాల్పడినట్లు ఒప్పుకున్నట్లు తెలిసింది.

రికవరీ చేస్తే తప్పు ఒప్పుకున్నట్లే...

ఉమ్మడి జిల్లాలోని 10 మంది రేంజర్లకు, శ్రీసత్యసాయి జిల్లాలోని 11 మంది సెక్షన్ ఆఫీసర్లు, బీట్ ఆఫీసర్లకు, గుత్తి రేంజ్‌లోని 12 మంది సెక్షన్ ఆఫీసర్లు, బీట్ ఆఫీసర్లకు, అనంతపురం రేంజ్‌లోని ఒక సెక్షన్ ఆఫీసర్‌తోపాటు ఐదుగురు ఎఫ్‌బీఓలకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. వీరిలో కొందరు రాబోయే రెండు, మూడు నెలల్లో ఉద్యోగ విరమణ పొందనున్నారు. దీనికి తోడు నోడ్యూస్ ఇవ్వకుండా పెండింగ్ పెడుతుండటంతో తక్కువ సొమ్ము రికవరీ చేయాల్సి ఉండటంతో కొందరు ఆ మొత్తాలను చెల్లించడానికి సిద్ధమవుతున్నట్లు సమాచారం. అలా సొమ్ము చెల్లిస్తే తప్పు అంగీకరించినట్లవుతుంది. అలా చేస్తే.. మీపై ఎందుకు చర్యలు చేపట్టకూడదని రాష్ట్రశాఖ ఉత్తర్వులు జారీ చేస్తే పరిస్థితి ఏమిటనే మీమాంసలో పడ్డారు. కీలకమైన ఆర్థిక లావాదేవీలు ఉన్న స్థానంలో కాంట్రాక్ట్ వర్కర్స్‌ను నియమించడంతో ఈ సమస్య ఉత్పన్నమయిందని ఆ శాఖ ఉద్యోగులు గగ్గోలు పెడుతున్నారు. ఇంత జరిగినా ఆ స్థానాల్లో తిరిగి కాంట్రాక్ట్ వర్కర్స్‌నే కొనసాగిస్తున్నారు. షోకాజ్ నోటీసులపై యూనియన్ తరఫున ఉద్యమానికి శ్రీకారం చుడుతున్నారు.

ప్రజల సొమ్మును దుర్వినియోగం కానివ్వం



అక్రమంగా దారి మళ్లిన సొమ్ము ప్రజల నుంచి వసూలు చేసింది. ఆ సొమ్ము అన్యాక్రాంతం కావడానికి వీలు లేదు. అందులో భాగస్వాములయిన సిబ్బంది ఉద్యోగ విరమణ పొందితే కొన్ని ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది. దీంతో వారు ఉద్యోగంలో ఉన్నట్లుగానే సమస్యను మరింత వేగవంతంగా పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నాం. అందులో భాగంగానే సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేశాం.

-విఘ్నేష్, జిల్లా అటవీశాఖ అధికారి

పైసలకొద్దీ.. పర్సెంటేజీ..!

పాయింట్ల కోసం టీచర్ల అడ్డదారులు

- మెడికల్ సర్టిఫికెట్ల పరిశీలనలో మాయలు
- బోగస్ చెవుడు సర్టిఫికెట్లతో లబ్ధి
- ఇతర ఉపాధ్యాయుల విస్మయం
- ఉన్నతాధికారులకు ఫిర్యాదు
- రీవెరిఫికేషన్‌కు సమాలోచనలు
- అక్రమార్కుల్లో ఆందోళన





అనంతపురం టౌన్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): బదిలీల్లో ప్రిఫరెన్షియల్ పాయింట్లు పెట్టుకుని కోరుకున్న పాఠశాలలకు వెళ్లడానికి కొందరు టీచర్లు చెవుడు మాస్టార్ల అవతారమెత్తారు. ఈనెల 24 నుంచి 26వ తేదీ వరకు ప్రిఫరెన్షియల్ కేటగిరీ పాయింట్లకోసం ప్రభుత్వం స్థానిక జిల్లా సర్వజనాస్పత్రిలో ప్రత్యేక పరిశీలన నిర్వహించింది. విద్యాశాఖ బదిలీల నిబంధనల మేరకు 40 శాతం అంగవైకల్యం ఉంటే 5 పాయింట్లు, 56శాతంపైగా ఉంటే 10, 70శాతం పైన ఉంటే ప్రిఫరెన్షియల్ కింద ముందువరసలో ఉంచి బదిలీల్లో అవకాశం కల్పిస్తారు. దీంతో టీచర్లు ప్రిఫరెన్షియల్ పాయింట్ల కోసం అడ్డదారులు తొక్కారు. చెవుడు లేకున్నా.. ఉన్నట్లు సర్టిఫికెట్లు పొందారు. ఈఎన్‌టీ విభాగంలో పనిచేస్తున్న ఒకరిద్దరు దళారీల ద్వారా ఆమ్యామ్యాలు అప్పగించి డాక్టర్లను మేనేజ్ చేసి చెవుడు లేకున్నా ఉన్నట్లు పర్సెంటేజీ వేసి సర్టిఫికెట్లు జారీ చేసినట్లు తెలుస్తోంది. ఇంతకాలం చెవుడులేకుండా వారు ఉద్యోగాలు చేశారు. ఇపుడు తమకు చెవుడు ఉందని వందమంది వరకు టీచర్లు సర్టిఫికెట్లు పొందడంపై ఇతర ఉపాధ్యాయులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. శ్రీసత్యసాయి జిల్లాలో ఓ స్కూల్ అసిస్టెంట్ ఏకంగా 70 శాతంపైగా చెవుడు ఉందని సర్టిఫికెట్ పొందారట. అనంతపురం రూరల్, శింగనమల, కళ్యాణదుర్గం, తాడిపత్రి, రాప్తాడు, హిందూపురం, ధర్మవరం నియోజకవర్గాల్లో కూడా టీచర్లు ఇలాగే చెవిటి సర్టిఫికెట్ పొందారట. ఒకే సామాజిక వర్గానికి చెందిన కొందరు టీచర్లు జట్టుగా ఏర్పడి ఇలా బోగస్ చెవిటి సర్టిఫికెట్లు పొందినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వైద్యవర్గాలు చెబుతున్న మేరకు 70 నుంచి 80శాతంపైగా చెవుడు ఉంటే వారికి మాటలు కూడా రావట. ఇక్కడ మాత్రం చెవుడు సర్టిఫికెట్లు పొందిన టీచర్లు ఏనాడూ చెవిటి మిషన్ కూడా వాడలేదట. దర్జాగా అందరితో కలిసి తిరిగారు. ఇపుడు మాత్రం 70 నుంచి 80 శాతం చెవుడు ఉందని సర్టిఫికెట్లు పొందడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి.

ఇద్దరి పాత్రపై అనుమానాలు

నకిలీ చెవుడు సర్టిఫికెట్ల జారీలో జిల్లా ఆస్పత్రి ఈఎన్‌టీ విభాగంలో పనిచేస్తున్న ఇద్దరి పాత్రపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వారు ఆ విభాగ డాక్టర్లతో మంచి సంబంధాలు కొనసాగిస్తున్నారట. ఈ నేపథ్యంలో టీచర్ల మెడికల్ సర్టిఫికెట్ల జారీలో ఆ ఇద్దరు డబ్బు సంపాదించాలని అక్రమమార్గంలో సర్టిఫికెట్ల జారీకి ప్లాన్ వేసినట్లు చెప్పుకుంటున్నారు. అప్పటికే పాయింట్ల కోసం అడ్డదారులు తొక్కుతున్న కొందరు టీచర్లు వారిని కలిసినట్లు తెలుస్తోంది. పాయింట్లవారీగా రూ.10వేల నుంచి రూ.20వేల వరకు ఒక్కొక్కరు చెల్లించేలా ఒప్పందం చేసుకుని, పరీక్షలు చేయకుండానే ఇంత శాతం చెవుడు ఉందని డాక్టర్లకు చెప్పడం, సర్టిఫికెట్లపై సంతకాలు చేయించడం చకచకా జరిగిపోయాయని టీచర్లతోపాటు ఆస్పత్రిలో వైద్యసిబ్బంది బహిరంగంగా మాట్లాడుకుంటున్నారు.

ఉన్నతాధికారులకు ఫిర్యాదులు

బోగస్ సర్టిఫికెట్ల జారీపై రాష్ట్ర ఉన్నతాధికారులకు కొందరు టీచర్లు ఫిర్యాదులు చేసినట్లు ఆ వర్గాల ద్వారా తెలిసింది. అక్రమ మార్గంలో పొందిన చెవుడు సర్టిఫికెట్లను పునఃపరిశీలించాలనే ఆలోచనలో రాష్ట్ర అధికారులు ఉన్నట్లు సమాచారం. గతంలో కూడా ఇలాగే కొందరు బదిలీలు, ఉద్యోగోన్నతుల సమయంలో చెవుడు సర్టిఫికెట్లు పెట్టడంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. అపుడు హైదరాబాద్‌లోని కోఠి ఈఎన్‌టీ ఆస్పత్రికి రెఫర్‌చేసి రీవెరిఫికేషన్ చేయించారని టీచర్లు అంటున్నారు. కొందరు ఇలాంటి చెవుడు సర్టిఫికెట్లు పెట్టి డీఎస్సీలో ఉద్యోగాలు పొందాలనే ఆరోపణలు రావడంతో అప్పుడు కూడా రీవెరిఫికేషన్ చేయించగా.. బోగస్ అని తేలడంతో పోస్టులు ఇవ్వలేదంటున్నారు. ప్రస్తుత విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ బదిలీలను పారదర్శకంగా నిర్వహించాలని చూస్తున్నా.. ఇంకా కొందరు బోగస్ మెడికల్ సర్టిఫికెట్లతో అక్రమంగా పాయింట్లు పొంది కోరుకున్న పాఠశాలలకు వెళ్లాలని అడ్డదారులు తొక్కడంపై విమర్శలు వస్తున్నాయి. దీంతో నష్టపోయే ఉపాధ్యాయులు కొందరు ఇదే విషయాన్ని రాష్ట్ర ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మెడికల్ క్యాంపులో చెవుడు సర్టిఫికెట్లు పొందిన టీచర్లకు రీవెరిఫికేషన్ పెట్టాలనీ, అందులో బోగస్ అని తేలితే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని నిర్ణయించినట్లు సమాచారం. ప్రస్తుతం బోగస్ చెవుడు సర్టిఫికెట్ల వ్యవహారం వాటిని పొందిన టీచర్లతోపాటు జారీచేసిన డాక్టర్లలో సైతం ఆందోళన రేపుతోంది.

ఆర్డీటీకి అండగా నిలుద్దాం..

ఉమ్మడి అనంత, ఇతర జిల్లాల్లోనూ కార్యకలాపాలు

- ప్రభుత్వాలకు మించి మౌలిక, విద్యా, వైద్యరంగాల్లో సేవలు
- రాజకీయాలకు అతీతంగా ఆర్డీటీని కాపాడుకుందాం: వక్తలు
- 1న సీఎం దృష్టికి తీసుకెళ్తాం: ఎంపీ బీకే పార్థసారథి
- కేంద్రమంత్రిని కలుస్తాం: అనంతపురం ఎంపీ అంబికా



ఐక్యత చాటుతున్న అఖిలపక్ష నాయకులు

అనంతపురం విద్య, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు, పార్టీలకు అతీతంగా ప్రజలకు మౌలిక వసతులు, విద్య, వైద్యం, క్రీడా ఇతర రంగాల్లో సేవలు అందిస్తున్న ఆర్డీటీకి అండగా నిలుద్దామని అఖిలపక్ష నేతలు పిలుపునిచ్చారు. అందరు ప్రజాప్రతినిధులు, అన్ని పార్టీలు, ప్రజాసంఘాలు, మేధావులు ఏకతాటిపైకి రావాలని కోరారు. సీఎం చంద్రబాబునాయుడు, కేంద్రం దృష్టికి తీసుకెళ్లి ఆర్డీటీకి ఫారిన్ కంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ యాక్ట్ (ఎఫ్‌సీఆర్‌ఏ) పునరుద్ధరించేలా ఒత్తిడి తెద్దామని ముక్తకంఠంతో పేర్కొన్నారు. సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం జడ్పీలోని సమావేశ మందిరంలో 'ఆర్డీటీని కాపాడుకుందాం- ఎఫ్‌సీఆర్‌ఏను కేంద్రం పునరుద్ధరించాలి' అన్న అంశంపై సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీష్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. హిందూపురం, అనంతపురం ఎంపీలు బీకే పార్థసారధి, అంబికా లక్ష్మీనారాయణ, జడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నాయకుడు విశ్వేశ్వరరెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప ఇతర నేతలు హాజరయ్యారు. ఆర్డీటీ అందిస్తున్న సేవలను గుర్తు చేసుకున్నారు. ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యూవల్ కాకపోవడంతో నిధులు అందక, సంస్థ అందిస్తున్న సేవలన్నీ నిలిచిపోతే జిల్లా ప్రజలే నష్టపోతారన్నారు. ఆర్డీటీని కాపాడుకోడానికి ప్రతిఒక్కరూ ముందుకు కదలాలని సూచించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు మల్లికార్జున, సీపీఐ ఎంఎల్ నేత నాగరాజు, వీకే రంగారెడ్డి, ఇతర నేతలు రాజేష్‌గౌడ్, కేశవరెడ్డి పాల్గొన్నారు.

కేంద్రం దృష్టికి తీసుకెళ్దాం



పేదరిక నిర్మూలన, మహిళా సాధికరతకు ఆర్డీటీ ఎంతగానో కృషి చేస్తోంది. ఆ సంస్థ సహకారంతో ఎందరో డాక్టర్లు, ఇంజనీర్లుగా, ఉన్నత ఉద్యోగులుగా ఎదిగారు. బత్తలపల్లి, కళ్యాణదుర్గం, కణేకల్లు ఇలా అనేక ప్రాంతాల్లో హాస్పిటల్స్ కట్టించి సేవలు అందిస్తోంది. ఆర్థిక సమస్యల్లోనూ ఏడాదిన్నరగా ఆర్డీటీ ద్వారా విరాళాలు సేకరించి సేవలు కొనసాగిస్తున్నారు. ఇప్పుడు ఆర్డీటీకి తోడ్పాటు అందించాలి. సంతకాల సేకరణ కార్యక్రమం చేపడతాం. కేంద్రంలోని ఎన్డీఏ దృష్టికి సమస్యను తీసుకెళ్దాం

- గిరిజమ్మ, జిల్లాపరిషత్ ఛైర్‌పర్సన్

1న సీఎం దృష్టికి తీసుకెళ్తాం



విన్సెంట్ ఫెర్రర్ స్పెయిన్ నుంచి వచ్చి 1969లో జిల్లాలో సేవలు ప్రారంభించారు. హాస్పిటల్స్ ఏర్పాటు చేసి రోగులకు, విద్యార్థులకు, మహిళలు, రైతులు ఇలా అన్నివర్గాల ప్రజలకు సేవలు అందించారు. విన్సెంట్ ఫెర్రర్, మాంచో ఫెర్రర్ ఎఫ్‌సీఆర్‌ఏ ద్వారా వచ్చిన డబ్బుతో పారదర్శకంగా ప్రజలకు సేవ చేశారు. ఈ సంస్థ ఉండాలని అందరూ కోరుకుంటున్నారు. జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎంపీలు అంతా కలిసికట్టుగా ఈనెల 1న సీఎం చంద్రబాబును కలుస్తాం. కేంద్రానికి సిఫార్సు చేయాలని కోరుతాం.

- బీకే పార్థసారథి, హిందూపురం ఎంపీ

56 ఏళ్లుగా సేవలు



ఆర్డీటీ 56 ఏళ్లుగా జిల్లా ప్రజలకు సేవలు అందిస్తోంది. దైవం మానుష రూపేణా అన్నట్టుగా ఫెర్రర్ దేవుడిలా వచ్చి జిల్లాలో సేవలు అందించారు. ప్రస్తుతం ఈ సంస్థకు ఊపిరిపోయాల్సిన అవసరం ఉంది. మాంచో ఫెర్రర్‌తో 3 రోజుల కిందట మాట్లాడా. కేంద్ర మంత్రి బండి సంజయ్ అపాయింట్‌మెంట్ కూడా తీసుకున్నాం. పహల్గాం ఘటన నేపథ్యంలో ఆయన బిజీగా ఉన్నారు. వారం, 10 రోజుల్లో కేంద్రమంత్రిని తప్పకుండా కలుస్తాం. సమస్యను కేంద్రం దృష్టికి తీసుకెళ్తాం. ఎఫ్‌సీఆర్‌ఏ పునరుద్ధరించేలా కృషి చేస్తాం.

- అంబికా లక్ష్మీనారాయణ, అనంతపురం ఎంపీ

కులమతాలకు అతీతంగా సేవలు



అనంతపురం నుంచి ప్రకాశం జిల్లా వరకూ కులమతాలకు అతీతంగా ఆర్డీటీ ప్రజలకు తోడ్పాటు అందిస్తోంది. దశాబ్దాలుగా సేవలు అందిస్తున్న ఆర్డీటీ నేడు ప్రమాదంలో పడింది. ఎఫ్‌సీఆర్‌ఏ పునరుద్ధరించకపోవడంతో దానిపై ఆధారపడిన వారి జీవితాలు రోడ్డున పడతాయి. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు చొరవ తీసుకోవాలి. ఎఫ్‌సీఆర్‌ఏను వెంటనే రెన్యువల్ చేయాలి. ఆర్డీటీ సేవలకు అంతరాయం కలుగకుండా చూడాలి.

- జగదీష్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు

ఆర్డీటీ.. జిల్లాకు వరం



జిల్లాకు ఆర్డీటీ వచ్చినపుడు 'గో బ్యాక్' అంటూ మొదట్లో వ్యతిరేకించారు. ఫెర్రర్ కృషితో ప్రజలకు దగ్గరైంది. నేడు ఈ జిల్లా ప్రజలతో విడదీయరాని బంధాన్ని పెనవేసుకుంది. ప్రభుత్వాల కంటే... ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలు ఆర్డీటీనే ఎక్కువగా ప్రేమిస్తారు. రాజకీయ రంగు అంటకుండా లక్షలాది మందికి ఇళ్లు కట్టించారు. మరెందరినో చదివించారు. కరువు పీడిత అనంతపురం జిల్లాకు ఈ సంస్థ రావడం ఒక వరంగా చెప్పవచ్చు. ఫెర్రర్‌ను దేవుడిగా కొలిచారు. ఈ సంస్థను కాపాడుకోడానికి అందరూ సానుకూలంగా స్పందించాలి.

- విశ్వేశ్వరరెడ్డి, మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత

రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలి



జిల్లాను ఆర్డీటీ ప్రపంచ పటంలో నిలిపింది. వేలాది మందికి రైతులకు ఉచితంగా బోర్లు వేయించడమే కాకుండా కోటికిపైగా పండ్ల మొక్కలు పంపిణీ చేసింది. పేద విద్యార్థులకు పాఠశాల స్థాయి నుంచి ఉన్నత చదువులు అందించింది. 88 వేలకుపైగా ఇళ్లు కట్టించి ఇచ్చింది. మరో కోటి మంది వరకూ వైద్య సేవలు పొందారు. అలాంటి ఆర్డీటీ ప్రమాదంలో పడింది. ఎఫ్‌సీఆర్‌ఏను వెంటనే పునరుద్ధరించాలి. అంతవరకూ ఆర్డీటీ బాధ్యతలను రాష్ట్ర ప్రభుత్వం తీసుకుని, కొనసాగేలా చూడాలి.

- నల్లన్న, సీపీఎం జిల్లా కార్యదర్శి

ఐక్యంగా ముందుకెళుదాం



ఆర్డీటీ ఎన్నో లక్షల మంది ప్రజల కలలు సాకారం చేసింది. ఎస్సీ, ఎస్టీ, పేదవర్గాల ప్రజలకు ఏ ప్రభుత్వం చేయని విధంగా సేవలు అందించింది. ఒక వైపు కరోనా వచ్చి ప్రజల ప్రాణాలు పోతుంటే... మనుషులను ముట్టుకోడానికి వెళ్లలేని దుర్భర పరిస్థితులు. ఆర్డీటీ వైద్యులు, నర్సులు మాత్రం ప్రాణాలను పణంగా పెట్టి సేవలు అందించారు. నేడు ఆర్డీటీని కాపాడడానికి అందరూ ఐక్యంగా కదలాల్సిన అవసరం వచ్చింది. ఆ సంస్థకు అండగా నిలుద్దాం.

- జాఫర్, సీపీఐ జిల్లా కార్యదర్శి

జిల్లాను కాపాడుకున్నట్లే..

● మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి

అనంతపురం కల్చరల్: ఆర్డీటీని కాపాడుకుంటే జిల్లాను కాపాడుకున్నట్లేనని మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి అన్నారు. ఆర్డీటీ సేవలు కొనసాగించేందుకు కేంద్ర ప్రభుత్వం సహకరించాలని కోరుతూ సోమవారం జిల్లా కేంద్రంలోని ప్యారడైజ్ ఫంక్షన్ హాల్‌లో ముతవల్లీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేఎం షకీల్ షఫీ అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ప్రభాకర్ చౌదరి మాట్లాడుతూ.. ఆర్డీటీకి అండగా ప్రతిఒక్కరూ స్పందించాల్సిన అవసరం ఉందన్నారు. ఆర్డీటీ గురించి ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లామన్నారు. కేంద్రం దృష్టికి తీసుకెళ్లేందుకు రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తుందన్నారు. ఆర్డీటీ సేవల కొనసాగింపుకోసం చేపట్టే ఉద్యమంలో అందరూ పాలుపంచుకోవాలని పిలుపునిచ్చారు. కేఎం షకీల్ షఫీ మాట్లాడుతూ... జిల్లాలో తినడానికి తిండిలేని సమయంలోనే గంజి కేంద్రాలు ఏర్పాటు చేసి సేవను మొదలు పెట్టింది ఆర్డీటీనేనన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని 12 జిల్లాల్లో ఆర్డీటీ సేవలందిస్తోందన్నారు. జిల్లాను ఎడారి కాకుండా నిలువరించిందన్నారు. అటువంటి సేవా సంస్థను కాపాడుకునేందుకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి, ఉద్యమం చేపట్టనున్నట్లు తెలిపారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ మాట్లాడుతూ... కులమతాలకు అతీతంగా అభాగ్యులు, పేదలకు నివాస స్థలాలు, భవనాలు నిర్మించి ఆర్డీటీ ఆదుకుంటోందన్నారు. ప్రభుత్వాలు సైతం చేయలేనన్ని సేవాకార్యక్రమాలను ఆర్డీటీ చేస్తోందన్నారు. ఆర్డీటీ సేవల కొనసాగింపు కోసం సమిష్టిగా పోరాడదామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టౌన్‌బ్యాంకు అధ్యక్షుడు జేఎల్ మురళీధర్, నగరపాలక సంస్థ మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్‌రెడ్డి, వాసంతి సాహిత్య, మాజీ మేయర్ స్వరూప, మాజీ డిప్యూటీ మేయర్ గంపన్న, నేతలు మచ్చా రామలింగారెడ్డి, రవికాంత్ రమణ, టీడీపీ ముస్లిం మైనార్టీ నాయకులు తాజుద్దీన్, ఐఎంఎం రాష్ట్ర అధ్యక్షుడు మహబూబ్‌బాషా, కాగజ్ ఘర్ రిజ్వాన్, ఎంఎండీఏ ఇమామ్, బీఎస్ఎన్ఎల్ రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.



పార్టీలకు అతీతంగా సంఘీభావం తెలుపుతున్న నాయకులు

9 నుంచి పెన్నహోబిలం బ్రహ్మోత్సవాలు


పోస్టర్లు విడుదల చేస్తున్న ఈవో, ఆలయ సిబ్బంది, టీడీపీ నాయకులు

ఉరవకొండ, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు మే 9 నుంచి 20 వరకు జరగనున్నాయి. అందుకు సంబంధించిన పోస్టర్లను సోమవారం ఆలయ ప్రాంగణంలో ఈఓ రమేష్‌బాబు, అర్చకుడు ద్వారకానాథాచార్యులు, టీడీపీ మండల కన్వీనర్ విజయ్‌భాస్కర్, జడ్పీటీసీ మాజీ సభ్యుడు గుర్రం సుధాకర్, మాజీ ఎంపీపీ సుంకరత్నమ్మ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ మే 9న అమిద్యాల నుంచి ఉత్సవ మూర్తులు పెన్నహోబిలం చేరడంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. 10న ప్రాకారోత్సవం, 11న సింహ వాహనోత్సవం, చంద్రప్రభవాహనోత్సవం, 12న గోవువాహనోత్సవం, శేషవాహనోత్సవం, 13 హంసవాహనోత్సవం, 14 హనుమంతవాహనోత్సవం, 15 గరుడ వాహనోత్సవం, కల్యాణోత్సవం, 16న సూర్యప్రభ, ఐరావతవాహనోత్సవం, 17న రథోత్సవం, 18నఅశ్వ వాహనోత్సవం, 19నధ్వజారోహణం, శయనోత్సవం 20న ఉత్సవమూర్తులు పెన్నహోబిలం నుంచి అమిద్యాలకు తిరిగి వెళ్లటంతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు.

చీనీ టన్ను రూ.23వేలు

అనంతపురం రూరల్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 23,100 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 4వేలు, సరాసరి రూ. 15వేలతో అమ్ముడుపోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 1047 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

రైల్వే డివిజన్లలో భద్రతా చర్యలు చేపట్టండి

గుంతకల్లు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వేలోని డివిజన్లలో ప్రయాణికుల భద్రత విషయంగా చర్యలు చేపట్టాలని జీఎం అరుణ్‌కుమార్ జైన్ పేర్కొన్నారు. సోమవారం ఉదయం సికింద్రాబాద్‌లోని రైల్ నిలయం నుంచి ఆరు డివిజన్ల డీఆర్‌ఎంలతో జీఎం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గుంతకల్లు డివిజన్ నుంచి డీఆర్‌ఎం చంద్రశేఖర్ గుప్తా పాల్గొన్నారు. జీఎం జైన్ ఈ సదస్సులో రైల్వేస్టేషన్లు, రైళ్లలో ప్రయాణికుల భద్రతపై సమీక్ష నిర్వహించారు. రైల్వే స్టేషన్లలోనూ, రైళ్లల్లోనూ జీఆర్పీ, ఆర్పీఎఫ్ దళాలు గస్తీను ముమ్మరం చేయాలని సూచించారు. రైల్ ట్రాక్, సిగ్నలింగ్ వ్యవస్థల భద్రతకు సంబంధించి స్పెషల్ డ్రైవ్‌ల పనితీరుపై ప్రశ్నించారు. లెవెల్ క్రాసింగ్‌లు, రూట్ సైడింగ్‌లపై, ఏసీ కోచ్‌లలో పొగను గుర్తించే డివైజ్‌లు, అగ్నిమాపక యంత్రాల విషయంగా సమీక్ష చేశారు. ప్రమాదాలు, చోరీలు జరక్కుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్సులో గుంతకల్లు డీఆర్‌ఎంతోపాటు సబార్డినేట్ అధికారులు పాల్గొన్నారు.

రైలుకింద పడి వృద్ధురాలి మృతి

తాడిపత్రి, ఏప్రిల్28(ఆంధ్రజ్యోతి): మండలంలోని చల్లవారిపల్లి సమీపంలో సోమవారం గుర్తుతెలియని వృద్ధురాలు రైలుకిందపడి మృతిచెందిందని రైల్వే ఎస్‌ఐ నాగప్ప తెలిపారు. ఆమెకు 60సంవత్సరాలుపైగా వయసు ఉంటుందనీ, వృద్ధురాలి వివరాలు పూర్తిగా తెలియలేదని ఆయన తెలిపారు.

ఉమ్మడి జిల్లాకు సమన్యాయం

రెండు నామినేటెడ్ పదవుల్లో సామాజిక సమతుల్యం

- ఏడీసీసీ బ్యాంకు ఛైర్మన్‌గా ముంటిమడుగు కేశవరెడ్డి
- డీసీఎంఎస్ ఛైర్మన్‌గా నెట్టెం వెంకటేష్


ముంటిమడుగు కేశవరెడ్డి


నెట్టెం వెంకటేష్

అనంతపురం, ఏప్రిల్28(ఆంధ్రజ్యోతి): నామినేటెడ్ పదవుల్లో ఉమ్మడి జిల్లాకు టీడీపీ అధినాయకత్వం సమన్యాయం చేసింది. సామాజిక సమతుల్యాన్ని పాటించింది. అనంత జిల్లా నుంచి ఏడీసీసీ బ్యాంకు ఛైర్మన్‌గా శింగనమల నియోజకవర్గం గార్లదిన్నె మండలానికి చెందిన ముంటిమడుగు కేశవరెడ్డిని నియమించింది. శ్రీసత్యసాయి జిల్లా నుంచి రాప్తాడు నియోజకవర్గంలోని కనగానపల్లి మండలానికి చెందిన నెట్టెం వెంకటేష్‌ను డీసీఎంఎస్ ఛైర్మన్‌గా ఎంపిక చేసింది. ఆ మేరకు సోమవారం టీడీపీ అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధికారికంగా ప్రకటించారు. ఏడీసీసీ బ్యాంకు ఛైర్మన్‌గా నియమితుడైన ముంటిమడుగు కేశవరెడ్డి శింగనమల నియోజకవర్గం, మరీ ముఖ్యంగా గార్లదిన్నె మండలంలో తెలుగుదేశం పార్టీకి బలమైన నాయకుడిగా గుర్తింపు పొందారు. సుదీర్ఘకాలంగా తెలుగుదేశం పార్టీలో కొనసాగుతున్నారు. పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడూ... అధినాయకత్వం ఆదేశాల మేరకు కార్యక్రమాలు నిర్వహంచడంతో పాటు వైసీపీ ప్రభుత్వాన్ని ఎండగట్టడంలో ప్రత్యేక ముద్ర వేసుకున్నారు. శింగనమల నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేసేందుకుగానూ అధినాయకత్వం ద్విసభ్య కమిటీలో ముంటిమడుగుకు స్థానం కల్పించింది. ఆ స్థాయిలోనే పార్టీని బలోపేతం చేసేందుకు ఆయన కృషి చేశారు. గత సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి విజయం కోసం తనవంతుగా పాటుపడ్డాడు. పార్టీ విధేయుడిగా కొనసాగుతున్న నేపథ్యంలోనే... ఆయనకు ఏడీసీసీ బ్యాంకు ఛైర్మన్‌గా అధిష్టానం అవకాశం కల్పించిందన్న అభిప్రాయం స్థానిక నేతల్లో వ్యక్తమవుతోంది. రాప్తాడు నియోజకవర్గం కనగానపల్లి మండలానికి చెందిన నెట్టెం వెంకటేష్ ఆది నుంచీ పరిటాల కుటుంబానికి అత్యంత సన్నిహితుడు. పరిటాల రవి రాజకీయాల్లోకి ప్రవేశించిన తొలినాళ్ల నుంచే నెట్టెం వెంకటేష్ టీడీపీలో చురుగ్గా కొనసాగుతున్నారు. పార్టీ కనగానపల్లి మండల కన్వీనర్‌గానే కాకుండా మాజీ ఎంపీపీగా కూడా పనిచేశారు. పార్టీలోనూ అనేక రాష్ట్రస్థాయి పదవుల్లో కొనసాగారు. పరిటాల రవి హత్యానంతరం ఆయన సతీమణి పరిటాల సునీత రాజకీయాల్లోకి వచ్చిన తరువాత కూడా... నెట్టెం వెంకటేష్. ఆ కుటుంబం వెంటే నడిచారు. ఓవైపు పరిటాల కుటుంబానికి... మరోవైపు తెలుగుదేశం పార్టీకి క్రియాశీలకంగా నెట్టెం వెంకటేష్ పనిచేస్తూ వస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఆయనను డీసీఎంఎస్ ఛైర్మన్‌గా పార్టీ అధిష్టానం నియమించింది. ఏడీసీసీ, డీసీఎంఎస్ ఛైర్మెన్లుగా నియమితులైన ముంటిమడుగు కేశవరెడ్డి, నెట్టెం వెంకటేష్.. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, జిల్లాలోని పార్టీ ముఖ్య నేతలకు కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనిచేస్తామని వారు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

సివిల్స్ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

అనంతపురంటౌన్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): సివిల్స్ పరీక్షలకు పోటీపడే జిల్లా అభ్యర్థులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. మే 25న యూపీఎస్సీ ద్వారా సివిల్స్ సర్వీసెస్ (ప్రిలిమినరీ) పరీక్షలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ పరీక్షలకు పోటీపడే జిల్లా అభ్యర్థులకు ఉచిత కోచింగ్ ఇవ్వడానికి ఏఆర్‌జీ రిఫ్లెక్షన్ అనే సంస్థ ముందుకు వచ్చిందన్నారు. ప్రతిభ గల అభ్యర్థులు ఢిల్లీ, హైదరాబాద్‌లోనే కాదు.. గ్రామీణ ప్రాంతాల్లోనూ ఉంటారని పేర్కొన్నారు. చదువుకు పేదరికం అడ్డుకాకూడదనే జిల్లాలోనూ సివిల్స్ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇప్పించాలని నిర్ణయించామని అన్నారు. అభ్యర్థుల ఎంపిక కోసం మే 4న ఎంట్రెన్స్ నిర్వహిస్తున్నామని, అందులో 20 మార్కులు తెచ్చుకున్న అభ్యర్థులకు మాత్రమే ఉచిత శిక్షణకు అవకాశం కల్పిస్తాం అన్నారు. పరీక్ష ఎక్కడ నిర్వహిస్తామనేది తర్వాత తెలియజేస్తామన్నారు. ఉచిత శిక్షణ బాధ్యతలను జిల్లాకు చెందిన విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ కరణం రామారావుకు అప్పగించినట్లు కలెక్టర్ తెలిపారు.

హౌస్ వైరింగ్‌పై ఉచిత శిక్షణ

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): రూడ్‌సెట్‌లో ఎలక్ట్రికల్ హౌస్ వైరింగ్‌పై ఈనెల 6వతేదీ నుంచి 30రోజుల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ డైరెక్టర్ విజయలక్ష్మి సోమవారం ప్రకటనలో తెలిపారు. ఆధార్, రేషన్‌కార్డు కలిగి ఉమ్మడి జిల్లాలో 18-45 సంవత్సరాల మధ్య వయసు కలిగిన గ్రామీణ నిరుద్యోగ యువకులు అర్హులన్నారు. శిక్షణా కాలంలో ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పిస్తామన్నారు. వివరాలకు 9492583484 నంబరులో సంప్రదించాలని కోరారు.

మద్యం షాపులకు దరఖాస్తు చేసుకోండి

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంత జిల్లాలో రీనోటిఫికేషన్ జారీ చేసిన మద్యం షాపులకు ఔత్సాహికులు దరఖాస్తు చేసుకోవాలని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య, అనంతపురం ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామమోహన్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనంతపురం జిల్లాలోని తాడిపత్రి పట్టణంలో మూడు, కళ్యాణదుర్గంలో ఒకటి, శ్రీసత్యసాయి జిల్లాలోని మడకశిరలో రెండు, గుడిబండలో ఒకటి, అమరాపురంలోని ఒక మద్యం షాపులకు దరఖాస్తులు ఆహ్వానించామన్నారు. ఆయా జిల్లాల్లో ఏ ఎక్సైజ్ స్టేషన్‌లోనైనా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మే 3వతేదీ సాయంత్రం 5 గంటల దాకా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. మే 5వతేదీ ఉదయం 8 గంటలకు అనంతపురం, సత్యసాయి జిల్లాల ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయాల్లో లాటరీ తీయనున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తుదారులు రూ.2 లక్షల నాన్‌రీఫండబుల్ ఫీజు చెల్లించాలన్నారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

● ఎన్ఎంయూఏ జిల్లా ఛైర్మన్ సూరిబాబు

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్టీసీ ఉద్యోగులకు సంవత్సరాల తరబడి అపరిష్కృతంగా ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆర్టీసీ ఎన్ఎంయూఏ జిల్లా ఛైర్మన్ సూరిబాబు డిమాండ్ చేశారు. డిమాండ్ల పరిష్కారం కోసం ఎన్ఎంయూఏ ఆధ్వర్యంలో సోమవారం అనంతపురం బస్టాండు ఆవరణలో రిలేదీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా సూరిబాబు మాట్లాడుతూ.. ఉద్యోగుల ఉద్యోగ భద్రతా సర్క్యులర్ 1/2019ను అన్ని డిపోలలో అమలు చేసి, అక్రమ సస్పెన్షన్లు, రిమూవల్స్ ఆపాలని డిమాండ్ చేశారు. గత నాలుగు సంవత్సరాలుగా ఆగిపోయిన ప్రమోషన్లను వెంటనే కల్పించాలన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మహిళా ఉద్యోగులకు పిల్లల సంరక్షణ సెలవులు మంజూరు చేయాలని అన్నారు. జీఓ 114లో పొందుపరిచిన మేరకు నైట్ అవుట్ అలవెన్సులను రూ.150 నుంచి రూ.400కు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సదాశివరెడ్డి, మద్దిలేటి, కేకేరావు, శ్రీనివాసులు, జి.శ్రీనివాసులు, రామాంజనేయులు, నీలకుమార్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.


రిలేదీక్షలు నిర్వహిస్తున్న ఎన్ఎంయూఏ నాయకులు, ఆర్టీసీ ఉద్యోగులు

మైనార్టీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తులు

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మైనార్టీ కార్పొరేషన్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అందించే సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకోవాలని ఈడీ సుబ్రహ్మణ్యం సోమవారం ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని మైనార్టీలు (ముస్లింలు, క్రిష్టియన్లు, సిక్కులు, బౌద్ధులు, జైనులు, పారశీకులు) స్వయం ఉపాధి రుణాలకు ఏపీఓబీఎంఎంఎస్ ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ట్రాన్స్‌పోర్ట్ సెక్టార్‌లో దరఖాస్తు చేసుకునే వారు డ్రైవింగ్ లైసెన్స్‌తోపాటు రేషన్ కార్డు, ఆధార్ కార్డు, ఆధార్‌కు లింకు అయిన మొబైల్ నంబరు నమోదు చేయాలన్నారు. దరఖాస్తుదారుడు ఉమ్మడి అనంతపురం జిల్లా వాసి అయి ఉండాలన్నారు. వయస్సు 21 నుంచి 55 ఏళ్లలోపు ఉండాలన్నారు. ఆదాయం పట్టణ ప్రాంతాల్లో రూ.2లక్షలు, రూరల్ ప్రాంతాల్లో రూ.1.50 లక్షలు కలిగి ఉండాలన్నారు. జనరిక్ మెడిసిన్ సెక్టార్‌లో రుణాలకు దరఖాస్తు చేసుకునే వారు పై అర్హతలతోపాటు డీ ఫార్మసీ/బీ ఫార్మసీ/ఎంఫార్మసీ చేసి ఉండాలన్నారు. మే 25వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. అనంతరం దరఖాస్తు హార్డ్ కాపీని పట్టణవాసులు మున్సిపల్ కమిషనర్‌కు, గ్రామీణ ప్రాంతాల వారు ఎంపీడీఓకి అందజేయాలన్నారు.

గురుకుల ప్రవేశాలకు..

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంతపురం జిల్లాలోని గిరిజన గురుకుల పాఠశాలల్లో ఖాళీగా ఉన్న సీట్లకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా గిరిజన సంక్షేమశాఖాధికారి రామాంజనేయులు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. 3వ తరగతి (నూతన ప్రవేశం), 4 నుంచి 9వ తరగతిలో బ్యాక్‌లాగ్ కింద ఎస్టీ విద్యార్థులచే ఖాళీ సీట్లను భర్తీ చేస్తామని పేర్కొన్నారు. అడ్మిషన్లు కావాల్సిన విద్యార్థులు సంబంధిత పాఠశాలల నందు మే 20వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మే 30న అనంతపురంలోని గిరిజన గురుకుల పాఠశాలలో లాటరీ తీస్తామన్నారు. 3వ తరగతి ప్రవేశంలో మాత్రమే ఎస్టీ 32, ఎస్సీ 05, బీసీ 02, ఓసీ 01 రిజర్వేషన్ విధానంలో భర్తీ చేస్తామని వివరించారు. కాగా... గొల్లలదొడ్డిలోని గిరిజన గురుకుల బాలుర కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపులలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో 40 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఎస్టీలకు 36 సీట్లు, ఎస్సీ, బీసీ, ఓసీ, ఏఈక్యూఎస్‌లకు ఒక్కొక్క సీటు చొప్పున కేటాయించామని తెలిపారు. అర్హులైన విద్యార్థులు మే 18వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్: 9885369079, 8978239363, 8341603090కు సంప్రదించాలన్నారు.

జిల్లాకు 54,184 క్వింటాళ్ల విత్తనాల కేటాయింపు

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఖరీఫ్‌కు సంబంధించి 54,184 క్వింటాళ్ల సబ్సిడీ విత్తనాలను కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వేరుశనగ 50,592 క్వింటాళ్లు కేటాయించారు. వరి 800, మినుములు 36, పెసలు 60, కంది 2380, అలసంద 60, రాగి 4, కొర్ర 45, జీలుగ 190, జనుము 2, పిల్లిపెసర 15 క్వింటాళ్లను కేటాయించారు.

న్యూస్ బాక్స్



గుంజేపల్లిలో నిర్వహిస్తున్న ర్యాలీ

పోషణ్ పక్వాడాపై అవగాహన

ముదిగుబ్బ, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుంజేపల్లి గ్రామంలో పోషణ పక్వాడ్‌పై సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ చంద్రమ్మ, ఎర్రమ్మ, విజయమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

● తనకల్లు : స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ పక్వాడ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సీడీపీఓ జయంతి, తహసీల్దార్ శోభాసువర్ణమ్మ మాట్లాడుతూ.. చిరుధాన్యాలను క్రమం తప్పకుండా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం జయంతి, ఎంఈఓ కళ్యాణి, ఎంపీడీఓ రఘునాథ్‌గుప్త, సూపర్‌వైజర్లు లక్ష్మీదేవమ్మ, జయమ్మ, కార్యదర్శులు పాల్గొన్నారు.

● తాడిమర్రి : మండల పరిధిలోని నార్సింపల్లి గ్రామంలో సోమవారం అంగన్‌వాడీ ఆధ్వర్యంలో పోషణ పక్వాడ్ కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లలితమ్మ గర్భవతులకు, తల్లిదండ్రులకు పలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం క్రిష్ణవేణి, అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భవతులు పాల్గొన్నారు.

1 నుంచి వేసవి శిక్షణ శిబిరం

ధర్మవరంరూరల్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ధర్మాంబ బాస్కెట్‌బాల్ అసోషియేషన్ ఆధ్వర్యంలో స్థానిక బాలుర జూనియర్ కళాశాల మైదానంలో వచ్చే నెల 1 నుంచి 30వ తేది వరకు వేసవి శిక్షణ శిబిరాన్ని ఉచితంగా నిర్వహిస్తున్నామని జిల్లా బాస్కెట్‌బాల్ అసోషియేషన్ సెక్రటరీ శెట్టిపి జయచంద్రారెడ్డి సోమవారం తెలిపారు. ఈ శిక్షణ శిబిరం ఉదయం, సాయంత్రం ఉంటుందని, దీన్ని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. మరిన్ని వివరాలకు 9030944717, 9391710032 నెంబర్లను సంప్రదించాలన్నారు.

టీడీపీ గ్రామ కమిటీల ఎన్నిక

ఓబుళదేవరచెరువు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని తుమ్మలకుంట్లపల్లి, శేషయ్యగారిపల్లి తండా పంచాయతీల్లో సోమవారం టీడీపీ గ్రామ కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. టీడీపీ మండల కన్వీనర్ శెట్టివారి జయచంద్ర, సర్పంచ్‌లు శ్రీదేవి, రేణుకాబాయి ఆధ్వర్యంలో కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తుమ్మలకుంట్లపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడిగా గంగినాయుడు, ఉపాధ్యక్షుడిగా రెడ్డెప్ప, ప్రధాన కార్యదర్శిగా ఇర్షాన్, శేషయ్యగారిపల్లి తండా గ్రామ కమిటీ అధ్యక్షుడిగా బి. భాస్కర్‌నాయక్, ఉపాధ్యక్షుడిగా నాగభూషణ్‌నాయక్, ప్రధాన కార్యదర్శిగా జయచంద్రనాయక్, కార్యవర్గ కార్యదర్శులుగా శ్రీరాములనాయక్, మనోహర్‌నాయక్, గోపాల్‌నాయక్, కార్యదర్శులు బీరేనాయక్, సుధాకర్‌నాయక్‌ను ఎన్నుకున్నారు.

రేపు పాలిసెట్

కదిరిఅర్బన్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశాలకు బుధవారం పాలిసెట్ నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వం పాలిటెక్నికల్ కళాశాల ప్రిన్సిపల్ కె. రమ సోమవారం ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ఐదు పరీక్షా కేంద్రాల్లో నిర్వహిస్తామన్నారు. ఆన్‌లైన్‌లో హాల్‌టిక్కెట్ రానివారు.. దరఖాస్తు చేసుకున్న అప్లికేషన్‌తో పాటు రూ. 400 పరీక్ష ఫీజు, రెండు పాస్‌ఫొటోలు, పది హాల్‌టిక్కెట్, ఆధార్‌కార్డు తీసుకుని దగ్గరలోని పాలిసెట్ పరీక్ష కేంద్రంలో సంప్రందించాలన్నారు. విద్యార్థులు ఉదయం 9గంటలకు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలన్నారు.

కొబ్బరి చెట్టుపై పిడుగు

గాండ్లపెంట, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమయాజుపల్లి పంచాయతీలోని కత్తివారిపల్లిలో ఆదివారం రాత్రి ఉరుములు, మెరుపులు వచ్చాయి. కొబ్బరి చెట్టుపై పిడుగు పడటంతో గ్రామస్థులు ఉలిక్కిపడ్డారు. గ్రామంలోని పలు గృహాల్లోని టీవీలు, ఫ్రిజ్‌లు, ఫ్యాన్లు, లైట్లు కాలిపోయాయి. ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు.

కనీస వేతనాలు ఇవ్వాలి

ధర్మవరంరూరల్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): తమకు కనీస వేతనాలు ఇచ్చి.. ఆదుకోవాలని స్థానిక మున్సిపల్ పారిశుధ్య అదనపు కార్మికులు విజ్ఞప్తి చేశారు. సోమవారం ఈ మేరకు స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. సీఐటీయూ మండల కన్వీనర్ జేవీ రమణ, కో-కన్వీనర్ అయూబ్‌ఖాన్ మాట్లాడుతూ.. కరోనా సమయంలో పారిశుధ్య కార్మికులను అదనంగా తీసుకున్నారని, వారికి కనీసవేతనం అమలుచేసి వారిని ఆదుకోవాలని కోరారు. అనంతరం కమిషనర్ ప్రమోద్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో కార్మికసంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎం.బాబు, ముకుంద, లక్ష్మీ, ఓబులేసు, చెన్నకేశవులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కూష్మాండ దీపోత్సవం



కాలభైరవస్వామి

ధర్మవరంరూరల్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): స్థానిక లక్ష్మీచక్రవర్తి థియేటర్ ఎదురుగా ఉన్న కాలభైరవస్వామి ఆలయంలో ఆదివారం రాత్రి అమావాస్య కంకరదారణ, కూష్మాండ దీపోత్సవం పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సోమవారం ఉదయం స్వామి వారికి అభిషేకాలు, దోషనివారణ పూజలను ఆలయ పూజారి ధనుంజయాచారి చేపట్టారు. భైరవుని ఎదుట మహిళ భక్తులు గుమ్మడి కాయలతో దీపాలు వెలిగించారు. అనంతరం కంకణధారణ కార్యక్రమం చేశారు. రెండు రోజుల పాటు ఆలయం వద్ద భక్తులకు అన్నదానం చేశారు.

నిబంధనల మేరకే పాఠశాల పునర్నిర్మాణం చేపట్టాలి

కదిరిఅర్బన్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపడుతున్న పాఠశాలల పునర్నిర్మాణ ప్రక్రియను నిబంధనలకు అనుగుణంగా... పాఠశాల యజమాన్య కమిటీ సభ్యులు తీర్మాణాల మేరకే చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ప్యాక్టో నాయకులు డిమాండ్‌చేశారు. సోమవారం వారు కదిరిలో డీఈఓ క్రిష్ణప్పకు వినతి పత్రం అందచేశారు. కొన్ని పాఠశాలల్లో కమిటీ తీర్మాణాలనుపరిగణలోకి తీసుకోకుండా పునర్నిర్మాణం చేపట్టడం సరికాదన్నారు. ఈ ప్రక్రియను వ్యతిరేకిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్యాక్టో నాయకులు హరిప్రసాద్‌రెడ్డి, షమీముల్లా, అతావుల్లా, అష్రఫ్, వాజీద్, సోహెల్ పాల్గొన్నారు.

గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు ప్రారంభం



తరగతులను ప్రారంభిస్తున్న గ్రంథాలయాధికారి

ధర్మవరంరూరల్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులను గ్రంథాలయ అధికారి అంజలి సౌభాగ్యవతి సోమవారం ప్రారంభించారు. ఈ శిక్షణ తరగతులలో విద్యార్థులకు సృజనాత్మకతను పెంపొందిచేందుకు స్పోకన్ ఇంగ్లీష్, డ్రాయింగ్, పెయింటింగ్, డ్యాన్స్, క్విజ్ పోటీలు, చదరంగం తదితర వాటిపై శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణ ముగిసిన అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇస్తామన్నారు. విద్యార్థులు ఈ వేసవి శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టీచర్ ముత్యాలప్ప, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వేసవి నేస్తాలు.. తాటిముంజలు

ఆరోగ్యానికి దివ్య ఔషధం

ధర్మవరం, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): వేసవి కాలంలో చల్లదనాన్ని ఇచ్చే వాటిలో ముందు వరుసలో నిలిచేవి తాటిముంజలు. ఎండల నుంచి తక్షణ ఉపశమనానికి తాటి ముంజలు ఎంతో ఉపయోగపడతాయి. కేవలం వేసవి కాలంలో మాత్రమే లభ్యమయ్యే వీటిని తినడంలో ఉన్న మజాయే వేరు. గతంలో ఎక్కడ చూసినా తాటి తోపులు ఎక్కువగా కనిపించేవి. దీంతో అవి చౌక ధరలకే లభించేవి. డజన్ రూ.40 నుంచి రూ.50 విక్రయించేవారు. ప్రస్తుత పరిస్థితి దీనికి పూర్తి భిన్నంగా ఉంది. మెట్ట భూములు రియల్ ఎస్టేట్లుగా మారుతుండటంతో తాటి తోపులు తరిగిపోతున్నాయి. దీంతో ప్రస్తుతం తాటిముంజలు చాలా తక్కువగా.. అక్కడక్కడ మాత్రమే లభ్యమవుతున్నాయి. దీంతో వాటిని డిమాండ్ ఏర్పడింది. ప్రస్తుతం తాటిముంజలు డజన్ రూ.100 లభిస్తున్నాయి.

● ఆరోగ్యానికి మేలు : తాటిముంజలు తక్కువ కేలరీలతో ఎక్కువ శక్తిని శరీరానికి అందిస్తాయి. తాటిముంజలు లేత కొబ్బరిని పోలి ఉంటాయి. దీంతో ప్రతిఒక్కరూ వీటిని తినేందుకు ఇష్టపడతారు. వేసవిలో వీటిని తినడం వల్ల చాలా ప్రయోజనం ఉంటుందని ప్రభుత్వ వైద్యుడు నజీర్ అంటున్నారు. తాటిముంజలు శరీరానికి కావలసిన మినరల్స్, చక్కెరను సమతుల్యం చేస్తుందని, వేసవి ఉష్ణోగ్రతలతో కొంతమందికి వాంతులయ్యే అవకాశం ఉందని, వీటికి తాటిముంజలతో చెక్ పెట్టవచ్చని అన్నారు. అలాగే డీ హైడ్రేషన్ నుంచి రక్షించడంతో పాటు పొట్టను శుద్ధి చేయడంలో తాటిముంజలు కీలక పాత్ర పోషిస్తామని అన్నారు.



విక్రయానికి ఉంచిన తాటిముంజలు



పుట్టపర్తిలో రిలే దీక్షలు చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యపై రిలేదీక్షలు

పుట్టపర్తి టౌన్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలని ఆర్టీసీ ఉద్యోగులు సోమవారం స్థానిక ఆర్టీసీ డిపో ముందు రిలే దీక్షలు సోమవారం ప్రారంభించారు. నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోషియేషన్ పిలుపు మేరకు ఈకార్యక్రమాన్ని చేపట్టారు. ఈకార్యక్రమంలో రీజనల్ ఛైర్మన్ ముత్యలప్ప, ఉపాధ్యక్షుడు కేశప్ప, డిపో కార్యదర్శి గంగులప్ప, ఉద్యోగులు బాబ్‌జాన్, రవితేజ, చెండ్రాయుడు, అప్పిరెడ్డి, శివశంకర్, నాగరత్నమ్మ, భవాని, మనోహర్, మోహన్ పాల్గొన్నారు.

● ధర్మవరంరూరల్: ఆర్టీసీ కార్మికులకు ఉద్యోగ భద్రత సర్క్యులర్‌ను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని ఆర్టీసీ డిపో నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోయేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్‌వీ రమణ డిమాండ్ చేశారు. ఈ మేరకు డిపో సెక్రటరీ మధుసూదన్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ డిపోలో ఆ సంఘం నాయకులు రిలే నిరాహారదీక్ష చేపట్టారు. ఈ దీక్షలో జోనల్ వైస్ ప్రెసిడెంట్ బీఎన్ శేఖర్, గ్యారెజీ సెక్రటరీ హరికృష్ణ, శ్రీనివాసులు, మంజునాథ్, గోపాల్, అహ్మద్, డిపో ట్రెజరర్ వైవీఎన్ రెడ్డి, కుమార్, మాధవ, ఎంసీజీరావు, గోపాల్‌రావు పాల్గొన్నారు.

● కదిరిఅర్బన్ : ఆర్టీసీ ఉద్యోగ భద్రత కల్పించాలని కదిరి ఆర్టీసీ డిపో ఎదుట ఎన్‌ఎంయూఏ ఆధ్వర్యంలో కార్మికులు సోమవారం రిలేదీక్షలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో భైరశెట్టి, వహీదాబేగం, మాధవి, నాగరాజు, మనోహర్, అయూబ్‌ఖాన్, ఈశ్వర్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

చిన్నారులకు ఆటల పోటీలు



ఆటల పోటీల్లో చిన్నారులు

కదిరి అర్బన్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని కుటాగుళ్ల అంగన్‌వాడీ కేంద్రంలో మేడే సందర్భంగా సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం చిన్నారులకు ఆటల పోటీలు నిర్వహించారు. పోటీల్లో పాల్గొన్న చిన్నారులకు బహుమతులు అందజేసి.. ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు జగన్మోహన్, రామమోహన్, బాబ్‌జాన్, అంగన్‌వాడీ కార్యకర్తలు సుజాత, ఇందిరమ్మ, రామలక్ష్మి, శాంతకుమారి, లక్ష్మీదేవి, చిన్నారులు, తల్లులు పాల్గొన్నారు.

నిరుద్యోగులూ.. బ్రోకర్ల మాయలో పడొద్దు



హరీష్‌బాబు

ధర్మవరం రూరల్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో పలువురు బ్రోకర్లు, దళారులు మంత్రి పేరుతో నిరుద్యోగులను మోసం చేయడానికి యత్నిస్తున్నారని, అలాంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి హరీష్‌బాబు తెలిపారు. స్థానిక ఎన్‌డీఏ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ.. మంత్రి పేరు చెప్పి ఉద్యోగాలు ఇప్పిస్తామని డబ్బులు వసూళ్లు చేస్తున్నారని, ఎవరూ వారి మాటలు నమ్మి మోసపోవద్దని హితువు పలికారు. ఇలా డబ్బులు డిమాండ్ చేస్తే తమ దృష్టికి తీసుకురావాలని, ఆ మోసగాళ్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బాల్య వివాహాలను అడ్డుకుందాం



కదిరి : పోస్టర్‌ను విడుదల చేస్తున్న మతపెద్దలు

కదిరి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాలు ఉమ్మడి అనంతపురం జిల్లాలోనే అధికంగా జరుగుతున్నాయని, వీటిని తగ్గించేందుకు అందరూ కృషి చేయాలని రెడ్స్ అధ్యక్షురాలు భానుజా పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఆర్‌అండ్‌బీ బంగ్లాలో ఆమె మాట్లాడుతూ.. బాల్య వివాహాల విషయంలో దేశంలో రాష్ట్రం నాలుగో స్థానంలో.. ఉమ్మడి అనంతపురం జిల్లా రాష్ట్రంలో మొదటిస్థానంలో ఉందన్నారు. ముఖ్యంగా ఆలయాలు, చర్చిలు, మసీదుల్లో ఆయా మత పెద్దలు పెళ్లిలు చేసే సమయంలో వధువరుల వయసు నిర్ధారించిన తరువాత పెళ్లిలకు అనుమతివ్వాలన్నారు. ఈనెల 30న అక్షయ తృతీయ నేపథ్యంలో ఎంతోమంది బాల్యవివాహాలు చేయడానికి సిద్ధమైనట్లు తెలుస్తోందని, దీనిని ప్రతిఒక్కరు అడ్డుకోవాలని అన్నారు. అనంతరం పోస్టర్లు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో మత పెద్దలు, రెడ్స్ సిబ్బంది పాల్గొన్నారు.

● కదిరి అర్బన్: సమష్టి కృషితో బాల్యవివాహాలను అరికట్టడం సాధ్యమని సమత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు ఆదినారాయణరెడ్డి, జిల్లా ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ శ్రీనివాసనాయుడు పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఆ సంస్థ కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. సంస్థ ఆధ్వర్యంలో శ్రీసత్యసాయి, అన్నమయ్య జిల్లాల్లో ఇప్పటిదాకా 700 బాల్యవివాహాలను అడ్డుకున్నట్లు చెప్పారు. బాల్యవివాహాలను నివారించడానికి పూజారులు, చర్చి ఫాదర్లు, మౌజన్లు కృషిచేస్తున్నారన్నారు.

ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యువల్ పునరుద్ధరించాలి



ఆర్డీఓకు వినతి పత్రం ఇస్తున్న సీఐటీయూ నాయకులు

ధర్మవరం రూరల్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ (విదేశీ విరాళాల నియంత్రణ చట్టం) రెన్యువల్‌ను పునరుద్దరించడానికి కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చేలా చర్యలు చేపట్టాలని సీఐటీయూ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలోని ఆర్డీఓ మహేష్‌కు వినతిపత్రం అందించారు. మండల కన్వీనర్ జేవీ రమణ, కో- కన్వీనర్ ఆయూబ్‌ఖాన్ మాట్లాడుతూ.. రాయలసీమలో ఆర్డీటీ సంస్థ అనేక మంది పేదలు, బడుగు బలహీన వర్గాల ప్రజలకు విద్య, వైద్యం అందిస్తూ ఆదుకుంటోందని, ఇళ్లను నిర్మించి ఇస్తోందని అన్నారు. రైతులు, మహిళల అభివృద్ధికి విశేష కృషి చేస్తోందనాన్నరు. వేలాది మంది ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించి ఆదుకుంటోందన్నారు. ఇలాంటి ఆర్డీటీ సంస్థకు ఎఫ్‌సీఆర్‌ఏ అనుమతిని కేంద్రప్రభుత్వం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఎల్ ఆదినారాయణ, నాగవేణి, లక్ష్మీదేవి, వరలక్ష్మి, సన్నప్పయ్య పాల్గొన్నారు.

ఘనంగా ఎద్దు పూజ

తనకల్లు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని తవళం గ్రామ సమీపంలో పాపాగ్ని నది పరివాహక ప్రాంతంలోని ఆంజనేయస్వామి ఎద్దుల పరుసలో భాగంగా సోమవారం ఘనంగా ఎద్దు పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు బోర్డు ఛైర్మన్ ఈశ్వర్‌రెడ్డి, గేమేనాయక్‌తండా సర్పంచ్ కాంతమ్మ, టీడీపీ నాయకులు శ్రీరాముల నాయక్, రమణయ్య, మల్లరెడ్డి, క్రిష్టారెడ్డి, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



ఎద్దు పూజ నిర్వహిస్తున్న గ్రామస్థులు

క్రైం న్యూస్..

కారు ఢీకొని వ్యక్తికి గాయాలు

ధర్మవరంరూరల్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని గరుడంపల్లి సమీపంలో కారు ఢీకొనడంతో ఉప్పునేసినపల్లి గ్రామానికి చెందిన పంగ వన్నూరప్ప (సన్న) తీవ్రంగా గాయపడ్డాడు. ఇతను సోమవారం తన బైక్‌లో ధర్మవరం నుంచి స్వగ్రామానికి బయలుదేరాడు. గరుడంపల్లి సమీపంలోకి ఓ కారు ఎదురుగా వేగంగా వచ్చి ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడ్డ వన్నూరప్పను వెంటనే స్థానికులు అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం బెంగుళూరు తరలించారు. రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

ఐదుగురిపై కేసు నమోదు

కొత్తచెరువు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): వ్యక్తిపై దాడిచేసిన ఘటనలో ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు అప్‌గ్రేడ్ సీఐ సురేష్ సోమవారం తెలిపారు. మండలంలోని మైలసముద్రం గ్రామానికి చెందిన సుబ్రమణ్యం, మండల కేంద్రానికి చెందిన సాలక్కగారి శీనప్ప మధ్య భూమి కొనుగోలు విషయంలో వివాదం తలెత్తింది. రెండు రోజుల క్రితం అన్నపూర్ణ హోటల్ వద్ద సుబ్రమణ్యంపై శీనప్ప, వెంకటేష్, మహేష్, హర్ష, సాయి దాడిచేశారు. దీంతో సుబ్రమణ్యంకు గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు ఆ ఐదుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు.



నిరవధిక సమ్మెలో పాల్గొన్న సీహెచ్ఓలు

సీహెచ్ఓల నిరవధిక సమ్మె

పుట్టపర్తిరూరల్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): తమ డిమాండ్లను అంగీకరించాలని వైద్యఆరోగ్యశాఖలో నేషనల్ హెల్త్‌మిషన్ కింద విధులు నిర్వహిస్తున్న సీహెచ్ఓలు సోమవారం నిరవధిక సమ్మెకు శ్రీకారం చుట్టారు. మూడు రోజులుగా వీరు పలు విధాలుగా నిరసనలు తెలిపినా.. స్పందన లేకపోవడంతో వారు జిల్లా వైద్యఆరోగ్యశాఖ కార్యాలయం ఎదుట నిరవధిక సమ్మె చేపట్టారు. అనంతరం వినతి పత్రాన్ని జిల్లావైద్యఆరోగ్యశాఖ అధికారి ఫైరోజ్‌బేగంకు అందచేశారు. కార్యక్రమంలో ఏపీఎంసీఏ జిల్లా అధ్యక్షుడు కార్తీక్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ నందీశ్వర్‌రెడ్డి, చందన, వేణుగోపాల్ పాల్గొన్నారు. ఈ సమ్మెకు ఏపీ ఎన్జీఓ సంఘం నాయకుడు లింగారాంమోహన్, ధర్మవరం తాలూకా ప్రెసిడెంట్ శంకర్, ట్రెజరీ అసోసియేషన్ అధ్యక్షుడు జగదీష్, ఏపీజీఏఈ ఉపాధ్యక్షుడు బాబాఫక్రుద్దీన్, సంఘం నాయకులు గఫూర్, దేవేందర్, రమణ, రామాంజినప్ప మద్దతుపలికారు.

టీడీపీని బలోపేతం చేయండి : ఎమ్మెల్యే



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట

కదిరి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ఎన్పీకుంట మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా ఉండి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ కోరారు. సోమవారం పట్టణంలోని తాయిగ్రాండ్‌లో ఏర్పాటు చేసిన ఎన్పీకుంట మండల టీడీపీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. 11 నెలల్లో టీడీపీ ప్రభుత్వం అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టిందని, ఆ అభివృద్ధిని ప్రజల ముందుకు తీసుకెళ్లడంలో పార్టీ శ్రేణులు విఫలమయ్యారని అన్నారు. ప్రతినెలా మండలంలో సమావేశం నిర్వహించి, చేసిన అభివృద్ధిని.. లోటుపాట్లును చర్చించాలన్నారు. ఈ సమావేశంలో మైనార్టీ రాష్ట్ర నాయకురాలు పర్వీనాభాను, కన్వీనర్ చంద్రశేఖర్‌నాయుడు, అంజనప్పనాయుడు, దండే రవి, శ్రీరాములు, పొల్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● సీఎం సహాయ నిధి చెక్కు అందజేత

తనకల్లు : మండలంలోని దేవళం తండాకు చెందిన కొర్రా శ్రీనివాసులనాయక్ వైద్య చికిత్సల నిమిత్తం ఆర్థిక సాయం కోసం ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నారు. అతనికి రూ.30,135 మంజూరైంది. ఆ చెక్కును కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ తన నివాసంలో బాధితుడికి సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో కోటపల్లి సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు చలపతి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

రేపు మున్సిపల్ అత్యవసర సమావేశం

ధర్మవరం రూరల్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బుధవారం ఉదయం 11.30 గంటలకు కౌన్సిలు హాల్లో అత్యవసర సమావేశం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ ప్రమోద్ కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని పలు సమస్యలపై, అజెండాలోని పలు అంశాలపై చర్చించి కౌన్సిలర్ల ఆమోదం పొందుతామన్నారు. కావున ఈ సమావేశానికి కౌన్సిలర్లు హాజరుకావాలని తెలిపారు.

పలు సమస్యలపై ఫిర్యాదులు

కదిరి అర్బన్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): పుట్టపర్తి, కదిరి, ధర్మవరం నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాల్లో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు సమస్యలు వెల్లువెత్తాయి. స్థానిక మున్సిపాలిటీలో అవుట్ సోర్సింగ్ కింద పని చేస్తున్న కార్మికులను 60 సంవత్సరాలు పైబడిందని పది మందిని తొలగించడం అన్యాయమని, తొలగించిన ఆ కార్మికుల స్థానంలో వారి పిల్లలకు అవకాశం ఇవ్వాలని సీఐటీయూ నాయకులు కోరారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందచేశారు. ఇందులో సీఐటీయూ నాయకులు జగన్మోహన్, బాలక్రిష్ణ, తిరుపాల్, జనార్దన్, రామమోహన్ పాల్గొన్నారు.

● కరువు రైతులను ఆదుకోవాలి

గాండ్లపెంట: మండలంలోని కరువు రైతులను ప్రభుత్వ ఆదుకోవాలని తహసీల్దార్ బాబురావుకు రైతు సంఘం నాయకులు సోమవారం వినతిపత్రం అందించారు. ప్రభుత్వం కరువు మండలంగా ప్రకటించిందని, ఇంతవరకు ఎలాంటి సాయమూ అందించలేదని అన్నారు. రైతులకు పంటనష్టపరిహారం అందించాలని, కేంద్రం వెంటనే మూడు శాతం వడ్డీ జమ చేయాలని, ఖరీఫ్‌లో సబ్సిడీతో విత్తన వేరుశనగ, అంతర్ పంట విత్తనాలు మంజూరు చేయాలని, బ్యాంక్‌లో రుణాలు రెన్యువల్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకుడు శ్రీరాముల నాయుడు, సీపీఎం నాయకుడు కెకె. రాజారెడ్డి, రెడ్డెప్ప, తిమయ్య నాయుడు, రామాంజనేయులు, ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

● మౌలిక సదుపాయాలు కల్పించాలి

ఓబుళదేవరచెరువు: మండలంలోని ఇనగలూరులో మాదిగ శ్మశాన వాటికకు మౌలిక వసతులు కల్పించాలని అంబేడ్కర్ కాలనీ వాసులు ఎంపీడీఓ రాబర్టు విల్సన్, తహసీల్దార్ అనంతచారికి వినతి పత్రం అందజేశారు. ఇందులో సీపీఐ మండల కార్యదర్శి చలపతినాయుడు, రత్నాబాయి తదితరులు పాల్గొన్నారు.

● పేదలకు ఇళ్ల పట్టాలివ్వాలి

ముదిగుబ్బ: మండలంలో నిరుపేద కార్మికులకు ఇంటి పట్టాలు మంజూరు చేయాలని సీపీఎం నాయకులు తహసీల్దార్ నారాయణస్వామికి వినతిపత్రం అందించారు. అలాగే మండల కేంద్రంలోని అక్సా మసీద్‌కు దారి ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ఆటో పెద్దన్న, ఆవాజ్ కమిటీ మండల కార్యదర్శి బాబ్జాన్, టైలర్ ముస్తఫా, అల్లాబకాష్, చర్మాల ఫక్రుద్దీన్, చికెన్ రఫీ, పక్కీరప్ప, వెంకటనారాయణ పాల్గొన్నారు.

● నంబులపూలకుంట : మండలంలోని నిరుపేదలకు ఇళ్లపట్టాలు ఇవ్వాలని సీఐటీయూ మండల కార్యదర్శి నాగరాజు రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ శారదకు వినతిపత్రం అందించారు. మండలంలో 14 పంచాయతీల్లో వందలాది మంది కూలీలు అదె ఇళ్లలో ఉంటున్నారని, అలాంటి వారిని గుర్తించి ఇంటి పట్టాలు ఇవ్వాలన్నారు.

● ప్రభుత్వ భూములను కాపాడండి

తనకల్లు : మండలంలోని ఎర్రబల్లి, గొళ్లపల్లి, మల్లిరెడ్డిపల్లి గ్రామాల్లోని ప్రభుత్వ భూమును రెవెన్యూ అధికారులు ప్రైవేటు వ్యక్తులకు సోలార్ ఏర్పాటుకు కేటాయిస్తున్నారని, ప్రభుత్వ భూములు ప్రైవేటు పరం కాకుండా అడ్డుకోవాలని సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్ నాయకులు తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు రెడ్డెప్ప, సీపీఎం నాయకులు శివన్న, రమణ, కాంగ్రెస్ నాయకులు పారేసు, పెద్దపల్లి, మల్లిరెడ్డిపల్లి, గొళ్లపల్లి, ఎర్రబల్లి గ్రామస్థులు పాల్గొన్నారు.



ఓడీసీ : ఎంపీడీఓ, తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ఇనగలూరు గ్రామస్థులు

న్యూస్ బాక్స్

తాగునీటి కోసం మహిళల ధర్నా



ఖాళీ బిందెలతో ధర్నా చేస్తున్న మహిళలు

గోరంట్ల, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మండ లకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట తాగునీటికోసం చలమయ్యగారిపల్లి మహిళలు ఖాళీ బిందెలతో సోమవారం ధర్నా చేపట్టారు. రెండేళ్లుగా చలమయ్యగారిపల్లిలో నీటి సమస్య ఏర్పడగా, మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో అధికారులకు గ్రామస్థులు తెలిపారు. సమస్య పరిష్కరించకపోగా, జిల్లా కలెక్టర్‌కు కూడా విన్నవించారు. సమస్య పరిష్కారం కాకపోవడంతో ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగాల్సివచ్చిందన్నారు. పొల్లాలవద్దకు రైతులు రాన్విలేదన్నారు. ఎంపీడీఓ నరేంద్రకుమార్ వారితో చర్చించి, వెంటనే చర్యలు నిమిత్తం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మోహన్, కార్యదర్శి ఆంజిలను గ్రామానికి పంపి, పరిశీలించి చర్యలు తీసుకోవాలన్నారు.

ఇంటి పట్టాల కోసం ఆందోళన

పెనుకొండ, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ఇల్లులేని పేదలందరికీ ఇంటిపట్టాలు, సాగుభూములకు పట్టాలు, పాసుపుస్తకాలు, వెంటనే మంజూరు చేయాలని సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నాయకులు, ఇళ్లలేని నిరుపేదలు బైఠాయించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్ మాట్లాడుతూ హైకోర్టు ఉత్తర్వుల మేరకు వెంటనే ఇంటిపట్టాలు ఇవ్వాలని, ఇస్లాపురం గ్రామంలో ప్రజలు సాగుచేస్తున్న భూములకు పట్టా, పాసుపుస్తకం ఇవ్వాలని డిమాండ్ చేశారు. జంగాలపల్లి పెద్దన్న, లక్ష్మీనారాయణ, హరి, బాబావలి, వెంకటరాముడు, తిప్పన్న, అయిష, అంజినప్ప, రాజు, బైలాంజి, అంజినమ్మ పాల్గొన్నారు.

ఆర్డీటీని కాపాడుకుందాం

అమరాపురం, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ఆర్డీటీని కాపాడుకుందామంటూ జైభీమ్ నాయకులు పిలుపునిచ్చారు. పేదలకు సాయం చేస్తూ, ఇళ్ల నిర్మాణం, విద్యార్థులకు ఉన్నత చదువులు అందిస్తున్న ఆర్డీటీని రద్దుచేయడం బాధాకరమన్నారు. సోమవారం జైభీమ్ సంస్థ ఆధ్వర్యంలో ఉదుగూరు గ్రామస్థులు, మహిళలు ఆర్డీటీ సంస్థ కావాలంటూ ర్యాలీ నిర్వహించి తహసీల్దార్‌కు వినతపత్రం అందించారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం



బోరు వేయిస్తున్న టీడీపీ నాయకులు

సోమందేపల్లి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని పందిపర్తి గ్రామంలో తాగునీటి సమస్య అధికంగా ఉండటంతో స్థానికుల అభ్యర్థన మేరకు మంత్రి సవిత బోరు వేయించినట్లు టీడీపీ నాయకుడు శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆదివారం ఆమె ఆదేశాల మేరకు గ్రామ సమీపంలో బోరువేయించామన్నారు. పుష్కలంగా నీరు పడటంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. నాయకులు మూర్తి, శ్రీనివాసులు, కాంతరాజు, నిడిమామిడి, తిప్పన్న, శ్రీనివాసులు, జయరాం, వెంకటేశ్, మంగమ్మ, నాగేష్, నవీన్ పాల్గొన్నారు.

ప్రతిభావంత విద్యార్థులకు సన్మానం



విద్యార్థులను సన్మానిస్తున్న స్థానిక ప్రముఖులు

గోరంట్ల, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గ్రంథాలయంలో ఎస్‌ఏపీఎస్ ఎయిడెడ్ కళాశాలలో ఇంటర్ ఫలితాల్లో అధిక మార్కులు సాధించినవారిని సోమవారం ఘనంగా సన్మానించారు. గోరంట్ల గ్రంథాలయం వేసవి శిక్షణ తరగతులను సోమవారం ప్రారంభించారు. స్థానిక సినీ నిర్మాత జీఎం సురేష్ ఆధ్వర్యంలో ప్రతిభగల విద్యార్థులకు విద్యాసామాగ్రితోపాటు, శాలువతో సన్మానించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సూర్యనారాయణ, గ్రంథాలయ కమిటీ అధ్యక్షుడు బైసాని శ్రీనివాస గుప్తా, రమేష్, రిటైర్డ్ తపాలా ఉద్యోగి బాషాసాబ్, గ్రంథాలయ అధికారి రమేష్ నాయక్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



రక్షితను సన్మానిస్తున్న అధికారులు

లేపాక్షి: పదోతరగతి పరీక్షల్లో మండల పరిధిలోని శిరివరం గ్రామానికి చెందిన రక్షిత 591 మార్కులు సాధించి ఉత్తమ ప్రతిభ కనబరిచింది. సోమవారం తహసీల్దార్ సౌజన్యలక్ష్మి ఆధ్వర్యంలో విద్యార్థినికి అధికారులు సన్మానించారు. ప్రతి వి ద్యార్థి రక్షితను ఆదర్శంగా తీసుకుని చదవాలన్నారు. ఎంఈఓ నాగరాజునాయక్, ఏఓ శ్రీలత, అధికారులు పాల్గొన్నారు.

యంత్రాలతో ఉపాధి పనులు చేస్తే చర్యలు: ఏపీడీ

అగళి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం ద్వారా వచ్చిన పనులు ఉపాధికూలీలతో కాకుండా యంత్రాలతో చేయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏపీడీ లక్ష్మీనారాయణ హెచ్చరించారు. మండలం ఇరిగేపల్లి గ్రామంలో సోమవారం కూలీలతో చర్చించారు. సింగిల్ విండో అధ్యక్షులు శ్రీనివాస్ సర్పంచ్ లక్ష్మమ్మ, లింగరాజు పాల్గొన్నారు.

పునీత్‌రాజ్‌కుమార్ పునర్జన్మ ఎత్తాలి

పావగడ, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): పునీత్‌రాజ్‌కుమార్ పునర్జన్మ ఎత్తాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు ఎమ్మెల్యే వెంకటేశ్ అన్నారు. పట్టణంలోని చెళ్లికెర క్రాస్‌లో పునీత్‌రాజ్‌కుమార్ సర్కిల్‌ను ఎమ్మెల్యే సోమవారం ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. చేసిన సాయం, ఇచ్చిన దానం ఎప్పటికీ మన చేయి వీడదని నమ్మకంతో రాష్ట్రంలోని ఎంతో మంది పేద విద్యార్థులకు కనిపించకుండా పునీత్ రాజ్‌కుమార్ చేసిన దానం ఎంతో గొప్పదని ఎమ్మెల్యే కొనియాడారు. ఆయన పేరుతో మరిన్ని సేవలు చేయడానికి తాను ముందుంటానన్నారు. ఈడిగకులస్థులు అంజేగౌడ, నామినేటెడ్ మునిసిపల్ కౌన్సిలర్ గంగాధర్, కౌన్సిలర్లు సురేష్, బాబు, గీత, హనుమంతరావు, ఆర్య ఈడిగ సంఘం అధ్యక్షుడు వీరాంజనేయ, కార్యదర్శి మల్లసంద్ర శివన్న, సభ్యులు రామచంద్రప్ప, హనుమేష్ పాల్గొన్నారు.



పునీత్‌రాజ్‌కుమార్ సర్కిల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఈదురుగాలులకు నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

హిందూపురం, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలో సోమవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. గాలులకు పట్టణంలోని హోండా షోరూం సమీపంలో చెట్లు, నాలుగు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. విద్యుత్ స్తంభం పార్క్‌చేసిన ద్విచక్రవాహనాలపై పడటంతో పాక్షికంగా దెబ్బతిన్నాయి. మరికొన్నిచోట్ల చెట్లు నేలకొరిగాయి. పరిగి మండలం సేవామందిరంలో అంధుల పాఠశాల వద్ద ఈదురుగాలులకు చెట్లు నేలకొరిగాయి. కొల్లకుంట వద్ద విద్యుత్ స్తంభాలు నేలకొరిగినట్లు ట్రాన్స్‌కో అధికారులు తెలిపారు. దీంతో ఆయా ప్రాంతాల్లో అంధకారం నెలకొంది.



పురంలో నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు



సేవామందిరం అంధుల పాఠశాలలో నేలకొరిగిన చెట్లు



కోనాపురంలో ఈదురుగాలులకు నేలకొరిగిన మొక్కజొన్న పంట

నేలకొరిగిన మొక్కజొన్న పంట

పెనుకొండ రూరల్: మండలంలోని కోనాపురంలో ఆదివారం సాయంత్రం భారీ ఈదురుగాలులకు మొక్కజొన్న పంట నేలకొరిగింది. కోనాపురం గ్రామానికి చెందిన రైతు శ్రీనివాసులు ఒకటిన్నర ఎకరాల భూమిలో కౌలుకుతీసుకుని పంట సాగుచేశాడు. మరో 20రోజుల్లో పంట చేతికొచ్చేదని ఈదురుగాలులకు మొక్కజొన్న పంట నేలకొరగడంతో దాదాపు రూ.50వేలు నష్టం వాటిల్లిందని బాధిత రైతు వాపోయాడు. ప్రభుత్వం స్పందించి ఆర్థిక సాయం అందించాలని రైతు కోరాడు.

మడకశిరలో 39.6మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు

మడకశిర టౌన్: నియోజకవర్గ వ్యాప్తంగా ఆదివారం రాత్రి ఉరుములు, మెరుపులు, ఈదురుగాలలతో కూడిన వర్షం కురిసింది 39.6 మి.మీ వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ కరుణాకర్ తెలిపారు. గుడిబండ 16.2 మి.మీ, రొళ్లలో 7.2, అరమాపురం 2.6, అగళిలో 11.4 మి.మీ వర్షపాతం నమోదు అయింది. వర్షం కురుస్తుండడంతో ఎండ వేడిమితో తట్టుకోలేక అల్లాడుతున్న ప్రజలకు వర్షం కురుస్తుండడంతో కాస్త ఉపశమనం లభించింది.

పురంలో సంబరాలు



ఎన్టీఆర్ సర్కిల్‌లో సంబరాలు చేసుకుంటున్న టీడీపీ నాయకులు

హిందూపురం, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి) : సినీనటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సోమవారం రాష్ట్రపతి చేతులమీదుగా పద్మభూషణ్ అవార్డు అందుకోవడంపట్ల పురంలో టీడీపీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. నాలుగు సింహాల ఎన్టీఆర్ సర్కిల్‌లో బాణసంచా పేల్చి మిఠాయిలు తినిపించుకున్నారు. మున్సిపల్ చైర్మన్ రమేష్, నియోజకవర్గ కోఆర్డినేటర్ శ్రీనివాసరావులు మాట్లాడుతూ ఎమ్మెల్యే బాలకృష్ణ పద్మభూషణ్ అవార్డు అందుకోవడం పట్ల హిందూపురం ప్రజలు ఎంతో ఆనందిస్తున్నారన్నారు. నాయకులు నాగరాజు, ఆనంద్, మంగేష్, సతీష్, రవినాయుడు, అయూబ్, బాచి, అమర్, అమీన్, పాల్గొన్నారు.

15 మంది బైండోవర్

అగళి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మండలం కోడిపల్లి గ్రామంలో ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణ కేసులో 15మందిని బైండోవర్ చేసినట్లు ఏఎస్ఐ శ్రీరాములు తెలిపారు. వారిని తహసీల్దార్ సుబ్బారావు ఎదుట హాజరు పరిచి ముందు ఎలాంటి గొడవలు జరగకుండా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఇందులో పది మంది పురుషులు ఐదుగురు మహిళలను బైండోవర్ చేశారు. కానిస్టేబుల్ శివ, కోడిపల్లి, వాల్మీకి సంఘం ఉపాధ్యక్షుడు రమేష్, మల్లికార్జున పాల్గొన్నారు.

కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోండి

పెనుకొండ, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): డివిజన్‌లో ప్రభుత్వ నిబంధనలు పాటించని ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బాబావలి, ఉపాధ్యక్షులు హర్షకుమార్, విద్యార్థులు స్థానిక డీవైఈఓ కార్యాలయంలో సీసీ సోనికి వినతిపత్రం అందించారు. నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ముందస్తు అడ్మిషన్లు, ప్రచారాలు చేస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా కార్యదర్శి భరత్, అనిల్, తజముల్, బాబావలి, ఖైఫ్, చిన్న, రిహాన్, ఉజేఫ్, అర్మన్ పాల్గొన్నారు.

ఉత్తీర్ణత శాతం పెంచాలి: డీఐఈఓ

పెనుకొండ, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల సంఖ్యను, ఉత్తీర్ణత శాతం పెంచడానికి కృషిచేయాలని డీఐఈఓ సయ్యద్ మౌలా సూచించారు. డీఐఈఓగా బాధ్యతలు తీసుకున్న తరువాత మొదటిసారిగా పెనుకొండకు వచ్చిన ఆయన స్థానిక జూనియర్‌కళాశాలలో నిర్వహిస్తున్న లెక్చరర్ల ఆన్‌లైన్ ఓరియంటేషన్ శిక్షణ తరగతులను పరిశీలించారు. సోమవారం అధ్యాపకులకు మ్యాథ్, కెమిస్ట్రీ తదితర సబ్జెక్ట్‌లపై శిక్షణను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయనను స్థానిక లెక్చరర్లు సుదర్శన్, అధ్యాపక బృందం పూలమాలలు, దుశ్శాలువలతో ఘనంగా సత్కరించారు.

పీఎఫ్‌పై అవగాహన

పెనుకొండ, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): స్థానిక గ్లోబుల్‌జెన్ పాఠశాలలో కరస్పాండెంట్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పీఎఫ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. పీఎఫ్ కార్యాలయ అధికారి శ్రీనివాసబాబు, ఉపాధ్యాయులకు, సిబ్బందికి పీఎఫ్‌పై అవగాహన కల్పించారు. 60ఏళ్ల తరువాత పీఎఫ్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

బీజేపీలోకి నాగేంద్రకుమార్ చేరిక

పావగడ, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి గాలిజనార్దన్‌రెడ్డి స్థాపించిన కళ్యాణ రాజ్య ప్రగతి పార్టీ నాయకుడు నాగేంద్ర కుమార్ బీజేపీలోకి చేరారు. సీనియర్ నాయకుడు జిల్లా కోర్ కమిటీ సభ్యుడు డా.వెంకటరామయ్య, తాలూకా అధ్యక్షులు అశోక్, రవి, సమక్షంలో ఆయన పార్టీ తీర్థం పుచ్చుకున్నారు.

వ్యర్థాల తొలగింపు



నదిలో వ్యర్థాలను తొలగించిన తర్వాత..

పరిగి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కొంత కాలంగా జయమంగళి నదిలో వేస్తున్న వ్యర్థాలను ఆంధ్రజ్యోతిలో సోమవారం ప్రచురితమైన జయమంగళి నదిలో వ్యర్థాలు అన్న కథనానికి పరిశ్రమ యజమానులు స్పందించారు. ఎక్స్‌కవేటర్ సాయంతో వాటిని ఇతర ప్రాంతాలకు తరలించారు.

ఉగ్రవాదాన్ని కూకటివేళ్లతో పెకలించాలి



ర్యాలీ చేస్తున్న న్యాయవాదులు

హిందూపురం, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రదాడికి పాల్పడ్డవారిని చట్టపరంగా కఠినంగా శిక్షించాలని న్యాయవాదులు అన్నారు. ఉగ్రవాదాన్ని కూకటివేళ్లతో పెకలించాలని హిందూపురంలో కోర్టు నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. బార్ అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ అభంశుభం తెలియని పర్యాటకులను ఉగ్రవాదులు కిరాతకంగా కాల్చిచంపడం హేయమైన చర్య అన్నారు. అధ్యక్షులు వన్నేరప్ప, న్యాయవాదులు రామచంద్రారెడ్డి, సత్యనారాయణ, ఇందాద్, శ్రీనివాసరెడ్డి, రాజశేఖర్, సిద్దు, సుదర్శన్, నాగరాజరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, నాగేంద్ర, క్రిష్ణమూర్తి, రాకీబ్, శ్రీరాములు పాల్గొన్నారు.

మైనర్లకు కౌన్సెలింగ్

హిందూపురం, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): హిందూపురం మండలానికి చెందిన 16ఏళ్ల బాలిక, పరిగి మండలానికి చెందిన 20ఏళ్ల యువకుడు సోమవారం ఉదయం ఇంటి నుంచి వెళ్లిపోయారు. అయితే వారి తల్లిదండ్రులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదుచేసిన హిందూపురం అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ మునిప్రతాప్ సిబ్బంది సాంకేతికపరిజ్ఞానంతో గుర్తించి సోమందేపల్లి మండలంలో ఓ కొండ ప్రాంతంలో ఉండగా అక్కడికి వెళ్లి వారిని తీసుకొచ్చి కౌన్సెలింగ్ ఇచ్చి వారి తల్లిదండ్రులకు అప్పగించారు.

మే డేను జయప్రదం చేయండి

మడకశిర టౌన్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): కార్మికుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మే డే వేడుకలను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్ వినోద్‌కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలో నియోజవకవర్గస్థాయి సమావేశం నిర్వహించారు. 1న అన్ని చోట్ల జెండా ఆవిష్కరణలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్మికులు, కర్షకజీవులు తమ హక్కుల కోసం నిత్యం పోరాటాలు చేస్తుంటారని వారికి సంఘం ఎప్పటికీ అండగా ఉంటుందన్నారు. జిల్లా నాయకులు రమేష్, ఆర్.జి.పవిత్ర సిద్దగిరి, సురేష్ పాల్గొన్నారు.

పోషణ్ పక్వాడాపై అవగాహన

అగళి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): స్థానిక డీఆర్డీఏ మండల సమైఖ్య కార్యాలయంలో సోమవారం మహిళలకు పోషణ్ పక్వాడాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జడ్పీటీసీ ఉమేష్, సీనియర్ అసిస్టెంట్ అమ్రుతవల్లి, ఏపీఓ సురేష్, సూపర్‌వైజర్ లీలావతి, సర్పంచ్ లక్ష్మమ్మ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఏపీఓ సురేష్, హెడ్ కానిస్టేబుల్ రాజ్‌కుమార్, లీలావతి, సీసీలు కదిరప్ప, మల్లికార్జున, ఓబులరాజు, దేవరాజు, మంజుళ, అమ్మాజమ్మ పాల్గొన్నారు.

నారనాగేపల్లికి ఆర్టీసీ బస్సు ప్రారంభం



నారనాగేపల్లికి బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న అధికారులు, నాయకులు

పెనుకొండ రూరల్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): హిందూపురం డిపో నుంచి రొద్దం మండలం నారనాగేపల్లికి ఆర్టీసీ బస్సును సోమవారం అధికారులు, నాయకులు ప్రారంభించారు. కొన్నేళ్లుగా నారనాగేపల్లికి బస్సు సౌకర్యం లేకపోవడంతో గ్రామస్థులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. పది రోజుల క్రితం నారనాగేపల్లి గ్రామస్థులు మంత్రి సవిత దృష్టికి తీసుకెళ్లగా ఆమె స్పందించి ఆర్టీసీ అధికారులతో మాట్లాడి బస్సు సౌకర్యం కల్పించారు. హిందూపురం నుంచి కలిపి మీదుగా నారనాగేపల్లికి బస్సు సర్వీసును ప్రారంభించారు.

రసాయన ఎరువులు వద్దు.. సేంద్రియ ఎరువులు ముద్దు

మడకశిర రూరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): రసాయన ఎరువులు వద్దు సేంద్రియ ఎరువులే ముద్దు అని రైతులు గ్రామాల్లో సోమవారం ర్యాలీ నిర్వహించారు. మండలంలోని గౌడనహళ్ళి, తురుకువాండ్లపల్లి, జమ్మానిపల్లి గ్రామాల్లో రైతులు ప్రకృతి వ్యవసాయ సాగుపై ర్యాలీ నిర్వహించారు. మాస్టర్ ట్రైనర్ రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయసాగుకు ప్రోత్సహం కల్పిస్తున్నాట్లు తెలిపారు. సేంద్రియ వ్యవసాయం వల్ల పంటలు ఆరోగ్యంగానూ, అధిక దిగుబడులు వస్తాయన్నారు. యూనిట్ ఇన్‌చార్జీలు. రైతులు పాల్గొన్నారు.

దందాలు, కబ్జాలు వైసీపీకే చెల్లు: టీడీపీ

హిందూపురం, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): దందాలు, కబ్జాలు, వసూళ్లు వైసీపీ నాయకులకే చెల్లుఅని టీడీపీ నాయకులు విమర్శించారు. సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మున్సిపల్ చైర్మన్‌రమేష్, మాజీ చైర్మన్ అనీల్, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ ఆనంద్, నాగరాజు, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ పరిమళ మాట్లాడారు. ఇటీవల ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పీఏపై ఓ పత్రికలో వచ్చిన కథనాలపై నాయకులు మండిపడ్డారు. టీడీపీ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, డా.సురేంద్ర బాలకృష్ణపై అభిమానంతో ఇక్కడ పనిచేస్తున్నారుతప్ప దోచుకెళ్లడానికి కాదన్నారు. ఐదేళ్ల వైసీపీ హయాంలో ప్రతి కార్యాలయంలోనూ వసూలు చేసింది ఆ పార్టీ నాయకులు కాదా అని ప్రశ్నించారు. హిందూపురం నుంచి కర్ణాటకకు వైసీపీ హయాంలో ఇసుక టిప్పర్లు పగలు, రాత్రి తేడాలేకుండా తరలించిన మాట వాస్తవం కాదా అన్నారు. ఇందుకు సంబంధించిన పెన్నానదిలో టిప్పర్లు ఉన్న ఫొటోలు విలేకరులకు చూపించారు. దీంతోపాటు తహసీల్దార్ కార్యాలయం, సబ్‌రిజిష్టర్, పోలీస్ స్టేషన్‌లు, మునిసిపల్ కార్యాలయం, సేల్‌ట్యాక్స్ కార్యాలయాల్లో ప్రతినెలా మామూళ్లు తీసుకోలేదా అని నిలదీశారు. టీడీపీ నాయకులు స్వచ్ఛందంగా ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకు పద్మభూషణ్ అవార్డు అందుకోవడంతో ఆయనకు ఘన సత్కారం చేయాలని నిర్ణయించారు. అంతేతప్ప వేరేవారివద్ద ఒక్కరూపాయి వసూలు చేసినట్లు నిరూపిస్తే మేము రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటామని సవాల్ విసిరారు. మార్కెట్‌యార్డ్ చైర్మన్ అశ్వత్థనారాయణరెడ్డి, సర్పంచ్ మంజునాథ్, హెచ్‌ఎన్ రాము, రఘు, ఆదినారాయణ, ప్రెస్ వెంకటేశ్, లీగల్‌సెల్ అధ్యక్షుడు శివశంకర్, ఇందాద్, అమీన్, శీన, అభి, చింటు, సిద్దు, బబ్లు పాల్గొన్నారు.



వైసీపీ హయాంలో టిప్పర్లతో ఇసుక తోలుతున్న ఫొటోలు చూపుతున్న నాయకులు

అవినీతి, అక్రమాలను ఉపేక్షించం

- ఎమ్మెల్యే ఎంఎస్ రాజు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల

మడకశిర టౌన్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ఎవరు అవినీతి, అక్రమాలకు పాల్పడినా ఉపేక్షించిదిలేదని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు హెచ్చరించారు. సోమవారం స్థానిక ఆర్ అండ్‌బీ అతిథి గృహంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడితో కలసి ఎమ్మెల్యే మాట్లాడారు. గత వైసీపీ పాలనలో ప్రతి పనికి ఒక రేటు వుండేదని, ఈ ప్రభుత్వంలో అలాంటి వాటికి ఆస్కారం లేదన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా కొన్ని సంవత్సరాలుగా ట్రాన్స్‌ఫార్మర్ల కోసం రైతులు దరఖాస్తు చేసుకొన్నా ఇచ్చిన పాపాన పోలేదన్నారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి రాగానే వారి సమస్యల పరిష్కారం కోసం సీఎం చంద్రబాబు, మంత్రి గొట్టిపాటి రవికుమార్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుంటే కొందరు అధికారులు, సిబ్బంది వల్ల చెడ్డ పేరు వస్తోందన్నారు. ఏ ఒక్క రైతు ట్రాన్స్‌ఫార్మర్ కోసం రూపాయి ఇచ్చే పని లేదని, ఏ అధికారి, సిబ్బంది అడిగినా తన దృష్టికి తీసుకొని రావాలని కోరారు. నియోజకవర్గంలో పార్టీలకు అతీతంగా ట్రాన్స్‌ఫార్మర్లు కావాలని ఎవరు దరఖాస్తు చేసుకున్నా అందిస్తామన్నారు. నియోజకవర్గానికి మరో వెయ్యి ట్రాన్స్‌ఫార్మర్లు తెప్పించి రైతులకు ఇప్పించే బాధ్యత మాదన్నారు. రైతుల గురించి పట్టించుకోని గత ప్రభుత్వం వల్ల చాలా సంవత్సరాల అన్నదాతలు బాధలు పడ్డారన్నారు. ఇటీవల మంత్రి పర్యటన సందర్భంగా కొత్తగా విద్యుత్ సబ్‌స్టేషన్‌లు ఆమిదాలగొంది, ఎం. రాయాపురం, చిట్నడుకు, గుడిబండ మండల కేంద్రం, ఆర్.జీ హళ్లి గ్రామాలలో కొత్త సబ్ స్టేషన్ల పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. తొమ్మిది నెలల్లోనే రైతులకు ఈ ప్రభుత్వంవల్ల న్యాయం జరిగిందన్నారు. అధికారులు కూడా రైతు సమస్యలు పరిష్కారానికి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని సూచించారు,

బాల్య వివాహ రహిత భారతదేశమే లక్ష్యం



మాట్లాడుతున్న సంస్థ అధ్యక్షుడు ఆదినారాయణరెడ్డి

పెనుకొండ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహరహిత భారతదేశంగా చూడాలన్నదే జస్టిస్‌రైట్ చిల్డ్రన్(జేఆర్‌సీ) లక్ష్యమని సమత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు ఆదినారాయణరెడ్డి అన్నారు. సోమవారం సమత కార్యాలయంలో బాల్య వివాహాల నిరోధంపై మత గురువులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలు నిర్మూలించడం, బాలికల రక్షణ, లైంగిక వేధింపులు, బాల కార్మికుల చట్టం అమలుపై సంస్థ విస్తృత కార్యక్రమాలు చేపట్టిందన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. బాలికల అక్రమ రవాణాను అడ్డుకుంటున్నామన్నారు. సత్యసాయిజిల్లాలో 366, అన్నమయ్యజిల్లాలో 377 బాల్య వివాహలను నిరోధించామన్నారు. జేఆర్‌సి ఆధ్వర్యంలో దేశంలో 416జిల్లాల్లో 250స్వచ్ఛంద సంస్థలతో పిల్లల హక్కుల పరిరక్షణ కోసం పనిచేస్తుందన్నారు. అన్నిమతాల గురువులను పెద్దలను కలుసుకుని మసీదులు, చర్చిలు, ఆలయాల్లో బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే పాస్టర్లు, ఇమాంలు, పండితులు వాటిని అరికట్టడానికి కృషిచేయాలని కోరారు. సంస్థ కోఆర్డినేటర్ వెంకటేశులు, చర్చి పాస్టర్ గోపాల్‌రెడ్డి, దర్గా ఇమాం బాబాఫకృద్దీన్ పాల్గొన్నారు.

నాటు వైద్యులపై పోలీసులకు ఫిర్యాదు



శ్మశానంలో చెట్టుకు కట్టిన రాగిరేకులు

గోరంట్ల, ఏప్రిల్28(ఆంధ్రజ్యోతి): మండలంలోని బూదిలి గ్రామానికి చెందిన నాటు వైద్యులైన తండ్రికొడుకులు కలీముల్లా, షేక్షావలీపై స్థానికులు సీఐ శేఖర్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. తండ్రికొడుకులు ఇదే గ్రామస్థుడు ముస్తఫాను వెంటపెట్టుకుని ఆదివారం అమావస్య రోజు రాత్రి 11గంటలకు చిత్రావతి ఒడ్డున శ్మశానవాటికకు వెళ్లినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. శ్మశాన వాటిక సమాధుల వద్ద పసుపు, కుంకుమ, నిమ్మకాయలతో క్షుద్రపూజలు నిర్వహించి, ఆరు సమాధుల కింద తమ పేర్లతో కూడిన రాగిరేకులను పూడ్చిపెట్టినట్లు ఆరోపించారు. అనంతరం ముస్తఫా ఇచ్చిన సమాచారం మేరకు హుస్సేన్‌సాబ్, భార్య మునీరాబాను, కుమారుడు మునవర్, ముజామీల్, ఈడిగ మురళి, కల్లుకుంట ఆంజనేయులు, వెంటనే స్పందించారు. రాత్రికి రాత్రే ఆప్రాంతానికెళ్లి క్షుద్రపూజలను ఛిద్రం చేసి, రాగిరేకులను తొలగించారు. తమపై క్షుద్ర పూజలు చేసిన తండ్రికోడులపై చర్యలు తీసుకోవాలని ఆరుగురు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గతంలో రెండు కుటుంబాల మధ్య తగాదాలున్నాయని, కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులు తెలిపారు

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

పెనుకొండ రూరల్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దచెరువు కట్ట ఆంజనేయస్వామి దేవాలయం సమీపంలో ద్విచక్రవాహనం అదుపు తప్పి బోల్తాపడిన ప్రమాదంలో సాయిసుదర్శన్ అనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగి గాయపడ్డాడు. హైదరాబాద్‌కు చెందిన సాయిసుదర్శన్ ద్విచక్రవాహనంలో బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు వెళ్తుండగా ఆంజనేయస్వామి దేవాలయం సమీపంలోకి రాగానే రాయిపై చక్రం ఎక్కించి బోల్తాపడ్డాడు. ప్రమాదంలో సాయిసుదర్శన్‌కు తీవ్రగాయాలయ్యాయి. గమనించిన సోమందేపల్లి జడ్పీటీసీ అశోక్ హుటాహుటిన క్షతగాత్రుడిని పెనుకొండ ఆసుపత్రికి తరలించి చికిత్సలు చేయించారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

గోరంట్ల, ఏప్రిల్28(ఆంధ్రజ్యోతి): మండలంలోని సామలపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వసంత్‌నాయక్ (25) అనే యువకుడు గాయపడి హిందూపురం ఆసుపత్రిలో చికిత్సపొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందినట్లు సీఐ శేఖర్ తెలిపారు. గోరంట్ల మండలంలోని మిషన్‌తండాకు చెందిన వసంత్‌నాయక్ హిందూపురం రహదారిలో వెళ్తుండగా ఆదివారం గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. వసంత్‌నాయక్‌కు తల్లిదండ్రులు లేరని, పెళ్లికాలేదని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసిన పోలీసులు ప్రమాదానికి కారణమైన గుర్తు తెలియని వాహనం కోసం దర్యాప్తు చేస్తున్నట్లుతెలిపారు.

ఓవర్‌హెడ్ ట్యాంకుల పరిశీలన

సోమందేపల్లి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని చాకర్లపల్లి, పాపిరెడ్డిపల్లి గ్రామాల్లో కొన్నేళ్లుగా నిరుపయోగ ంగా ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంక్‌లను ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో కలిసి టీడీపీ నాయకులు పరిశీలించారు. మంత్రి సవితమ్మ ఆదేశాల మేరకు గ్రామాల్లో మంచినీటి సమస్య పరిష్కారం కోసం నిరుపయోగంగా ఉన్న ట్యాంకుల మరమ్మతుల కోసం పరిశీలించినట్లు నీరుగంటి చంద్ర తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మహేష్‌తో కలిసి వాటిని పరిశీలించారు. వీలైనంత త్వరగా వాటి మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకురావాలని కోరారు. రానున్న రోజుల్లో గ్రామాల్లో తాగునీటి సమస్య పూర్తిస్థాయిలో పరిష్కారానికి ముందస్తు చర్యల్లో భాగంగా కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. మండల కన్వీనర్ సిద్దలింగప్ప, టౌన్‌కన్వీనర్ సూరి, కిష్టప్ప, సూర్యనారాయణ, వెంకటేశులు, సూర్యనారాయణ పాల్గొన్నారు.